ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

Published From Nizamabad

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



బుధవారం | 29-07- 2026 | సంపుటి: 17, సంచిక: 116, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆


# హైడ్రా ఆగదు

## హైడ్రా పనులు భవిష్యత్‌లోనూ కొనసాగిస్తుంది



ప్రశ్న పత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

చర్యలు తీసుకోకపోవడం వల్లనే సీబీఎస్ఈకి విస్తరించిన గ్లోబరీనా అక్రమాలు

కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

ఢిల్లీ: ప్రశ్న పత్రాల లీకేజీలకు కారణమైనవాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాల లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయంలో దేశస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారని సీఎం తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీల నివారణకు సంబంధించి పెద్దగా ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేది చూస్తామని సీఎం ఒక ప్రశ్నకు బదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సీఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. గ్లోబరీనా వటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్ఈ పరీక్షల వరకు విస్తరించి, వాటిని గందరగోళం చేశారని సీఎం విమర్శించారు.

తరువాయి 2వ పేజీలో...



## తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

స్థానిక అవసరాలకు తగినట్లు వీబీ జీ రామ్ జీలో పనులు చేర్చండి...

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

ఢిల్లీ: తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్‌కింద 11,56,915 ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కృషి భవన్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వివరించారు. గత ప్రభుత్వం PMAY-G ను వినియోగించుకోకపోవడంతో రాష్ట్రంలో గత పదేళ్ల పేదలు సొంత ఇళ్ల నిర్మించుకోకపోవడంతో, ఇప్పుడు తీవ్ర డిమాండ్ నెలకొందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.

తరువాయి 2వ పేజీలో...



భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో

# రీ-సర్వే కీలక ఘట్టం

## ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి

రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

నిర్దేశించిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి

అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

హైదరాబాద్, జూలై 28 (ప్రజాకలం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఌ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని,

తరువాయి 2వ పేజీలో...

దాసరి ధర్నా రాజకీయ లబ్ధి కోసమే

- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ దుష్ప్రచారం
- కాంగ్రెస్ నాయకుల ధ్వజం

3

## కలం కౌంటర్




పేపర్ లీక్ ఆందోళనలో విద్యార్థులకు

# భారీ ఊరట

## కేసులు ఎత్తివేసి, విడుదల చేయాలన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 28: నీట్ పేపర్ లీక్ ఆందోళన విషయంలో విద్యార్థులకు భారీ ఊరట లభించింది. నేర చరిత్ర లేని 18 ఏళ్ల విద్యార్థులను తక్షణం విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. విద్యార్థులను తక్షణం విడుదల చేయాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఘటనలపై సీసీటీవీ ఫుటేజీ వీడియోలను సమర్పించాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు విద్యార్థులకు ఊరట కలిగిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆందోళనల్లో పాల్గొన్న 3000 మంది



విద్యార్థుల్లో 101 మందికి నేర చరిత్ర ఉంది, వారిలో 62 మందిపై హత్యాయత్నం కేసులు ఉన్నాయనని సొలిసిటర్

తరువాయి 2వ పేజీలో...

## రైతు చెంతకు నూతన సాంకేతికతను చేరవేయడమే

# 'రైతునేస్తం' లక్ష్యం

సచివాలయంలో ఘనంగా రైతునేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమం

1600 రైతువేదికల ద్వారా లక్షలాది మంది రైతుల భాగస్వామ్యం

రైతు - శాస్త్రవేత్త - అధికారుల మధ్య ప్రత్యక్ష అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదికను విజయవంతంగా నిర్వహిస్తున్నారని సిఎస్ కితాబు

ఎల్-నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర - మంత్రి తుమ్మల

తోటి రైతుల విజయగాథలను, రాష్ట్ర రైతాంగానికి పరిచయం చేస్తున్న వేదిక




హైదరాబాద్, జూలై 28 (ప్రజాకలం): హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన 'రైతునేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ బి. గోపి, హార్టికల్చర్ ఎండీ యాస్మిన్ బాషా, సహకార శాఖ కమిషనర్ రాహుల్ రాజ్, వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు జానయ్య, రాజిరెడ్డి, వివిధ జిల్లాల ఆదర్శ రైతులు, అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1600 రైతువేదికల ద్వారా లక్షలాది మంది రైతులు

తరువాయి 2వ పేజీలో...

ప్రభుత్వ ఆసుపత్రి

# అపూర్వ ప్రగతి

రెండేళ్లలో 2,081 ఆర్థో సర్జరీలు, 5,067 ప్రసవాలు

990 మంది నవజాత శిశువులకు పునర్జన్మ

రూ.52 కోట్లతో 100 పడకల ఆసుపత్రిగా విస్తరణ

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు



పెద్దపల్లి,జూలై 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించడంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలిచిందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు తెలిపారు. గత రెండు సంవత్సరాల కాలంలో ఆసుపత్రి సాధించిన అపూర్వ ప్రగతి,అందించిన వైద్య సేవల వివరాలను మంగళవారం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణరావు మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ,జిల్లా మంత్రి శ్రీధర్ బాబుల ప్రత్యేక చొరవ,

తరువాయి 2వ పేజీలో...



కోరుట్ల నియోజకవర్గంలో వైద్య సేవల బలోపేతానికి

# ఎమ్మెల్యే సంజయ్ 19 ప్రతిపాదనలు

కోరుట్ల ఆరోగ్య రంగానికి భారీ ప్రణాళికలు.. మంత్రి దృష్టికి ఎమ్మెల్యే వినతులు

ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధే లక్ష్యం.. వైద్య శాఖ సమీక్షలో సంజయ్

కోరుట్ల ప్రజలకు మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ

ఆసుపత్రుల్లో వైద్యుల కొరత తీర్చాలి.. రాష్ట్ర సమావేశంలో ఎమ్మెల్యే విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 28 (ప్రజాకలం): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రస్థాయి వైద్య–ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని కోరుతూ 19 కీలక ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను వెంటనే తీర్చాలని, ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులను బదిలీ చేయకుండా కొనసాగించాలని ఎమ్మెల్యే కోరారు.

తరువాయి 2వ పేజీలో...

బఫర్ జోన్లో కబ్జాలకు పాల్పడితే

# ఉపేక్షించేది లేదు

## నిబంధనలు అతిక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తాం

బాధ్యులు ఎవరైనా సరే కఠిన చర్యలు..

ఇరిగేషన్,రెవెన్యూ,వాటర్ బాడీ జోన్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించాలి...

అంబర్‌పేట్ మూసి బఫర్ జోన్ ను సందర్శించిన ఇరిగేషన్ ఏఈఇ అనిల్ కుమార్







అంబర్‌పేట్ జూలై 28(ప్రజాకలం న్యూస్) అంబర్‌పేట్ మూసి బఫర్ జోన్ లో కబ్జాలకు పాల్పడుతూ నిర్మాణాలు, చేపడితే నిర్దాక్షిణ్యంగా కూల్చివేసి పోలీస్ కేసులు పెడతామని ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ కుమార్ హెచ్చరించారు.

2 లో...

# హైడ్రా ఆగదు

మొదటి పేజీ తరువాయి...

ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ. 8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలమీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్నవాళ్లకు బకాయిలు చెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీ వంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సీఎం ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచిస్తున్నట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు.

రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ. 2,200 నుంచి రూ. 2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమవుతాయని సీఎం అన్నారు. క్రమం తప్పకుండా వాటిని చెల్లించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, కుంటలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ పార్కులను కబ్జాలు పెట్టుకున్నోళ్లు కోర్టులను తప్పుదోవ పట్టించి కంటెంప్ట్ ఆఫ్ కోర్టు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు.

కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కింద అధికారులను మార్చాలనే నిబంధన ఉంటే, గతంలో సోమేశ్‌కుమార్ మీద 400 కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసులున్నాయని, అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వం విచక్షణాధికారమని, దానిని ఎవరూ గుంజుకోలేరని సీఎం స్పష్టం చేశారు. న్యాయస్థానాల మీద తనకు సంపూర్ణమైన విశ్వాసం ఉందని సీఎం తెలిపారు. హైడ్రా మంచి పనులు చేస్తోందని, తమ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రేటెస్ట్ రిఫార్మ్ హైడ్రా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైడ్రా అత్యుత్తమ సంస్థల్లో ఒకటని, ప్రభుత్వ పార్కులు, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా విధి అని, ఆ పనిని హైడ్రా పకడ్బందీగా చేస్తోందని సీఎం తెలిపారు. బతుకమ్మ కుంటలాంటి దానిని బీఆర్ఎస్‌వాళ్లు కబ్జా పెట్టుకున్నారని, దానినిపై కూడా కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసు వేశారని సీఎం విమర్శించారు. ఆ కుంట పేరే బతుకమ్మ కుంట అని, దానిపై కేసు నడుస్తోందని, వాటిని ఏవిధంగా చూడాలని సీఎం ప్రశ్నించారు. హైడ్రాని పనిచేయకుండా అడ్డుకోవాలనే కబ్జాకోరులకు సహకరించవద్దని మీడియాకు సీఎం విజ్ఞప్తి చేశారు. హైడ్రా ఎన్ కన్వేన్షన్ కూలగొట్టింది.. అది పేదోళ్లదా? గండిపేట చెరువులో ఆక్రమణలు కూలగొట్టింది... అవి పేదోళ్లవా? బతుకమ్మ కుంటను ఆక్రమించుకున్నోళ్లు పేదోళ్లా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కబ్జాదారులను కాపాడటానికి డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. హైడ్రా కారాచరణపైనా, హైడ్రా నిర్వహిస్తున్న బాధ్యతలపైనా ప్రభుత్వానికి స్పష్టత ఉందని సీఎం తెలిపారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఇంకా పరిశీలించలేదని, ప్రభుత్వపరంగా సమీక్షిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రశ్నకు బదులిచ్చారు. కోర్టు ఆదేశాలను, న్యాయస్థానాన్ని గౌరవిస్తామని, అదేవిధంగా హైడ్రా కొనసాగిస్తున్న పనులను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో

# రీ-సర్వే కీలక ఘట్టం

మొదటి పేజీ తరువాయి...

ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ-సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికతతో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చెందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి అపూర్వ ప్రగతి

మొదటి పేజీ తరువాయి...

జిల్లా కలెక్టర్ సహకారంతో పదేళ్ల నిర్లక్ష్యాన్ని వెనక్కి నెట్టి ఈ ఆసుపత్రిని రాష్ట్రానికే తలమానికంగా తీర్చిదిద్దామని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ సహకారంతో ప్రత్యేకంగా శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ద్వారా నవజాత శిశువులకు అద్భుతమైన సేవలు అందుతున్నాయని తెలిపారు. శిశువుల ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన వార్మర్లు, ఫోటోథెరపీ యూనిట్లు, సీపాప్ యంత్రాలు మరియు అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చుకున్నామని చెప్పారు. గడిచిన సంవత్సర కాలంలో ఏకంగా 990 మంది నవజాత శిశువులకు రూ. 9 కోట్ల విలువైన అత్యుత్తమ వైద్య సేవలను ఉచితంగా అందించి పునర్జన్మ ప్రసాదించామని తెలిపారు. ఇక గత రెండు సంవత్సరాలలో ఆసుపత్రి ద్వారా మొత్తం రూ. 130 కోట్ల పైచిలుకు విలువైన ఉచిత వైద్య సేవలను పేద ప్రజలకు అందించామని విజయ రమణరావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 2,081 మందికి ఆర్థోపెడిక్ ఆపరేషన్లు నిర్వహించి సుమారు రూ. 10.40 కోట్ల విలువైన వైద్యం ఉచితంగా అందించగా, 6,477 మందికి పైగా జనరల్ సర్జరీలు నిర్వహించి సుమారు రూ. 32.38 కోట్ల విలువైన సేవలు అందించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో 567 ప్రసవాలు జరిగాయని, ప్రైవేట్ ఆసుపత్రులతో పోలిస్తే ఇది పేద కుటుంబాలకు సుమారు రూ. 2.53 కోట్ల ఆర్థిక భారాన్ని తప్పించిందని చెప్పారు. దీనికితోడు 40,923 యూజీఎస్ స్కానింగ్‌లు, 2,355 టూ-డీ ఎకో టెస్ట్‌లు, 32,305 ఈసీజీ పరీక్షలతో పాటు ఏకంగా 5,12,290 మందికి ఉచితంగా ఓపీ సేవలు, మందులు అందజేశామన్నారు. అంతేకాకుండా 3,096 కంటి శుక్ల ఆపరేషన్లు, 216 రూట్ కెనాల్ సర్జరీలతో పాటు అత్యవసర సేవల కోసం రూ. 20 లక్షలతో నూతన అంబులెన్స్‌ను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. పెద్దపల్లి ఆసుపత్రికి వస్తున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా 50 పడకల ఆసుపత్రిని 100 పడకలకు ఆధునీకరిస్తున్నామని, రాబోయే జనవరి-ఫిబ్రవరి నాటికి నూతన భవనం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే వెల్లడించారు. అంతేకాకుండా, పేషెంట్లు ఎంఆర్ఐ, సీటీ స్కాన్ల కోసం కరీంనగర్ వెళ్లే ఇబ్బందులను పూర్తిగా తొలగించేందుకు రూ. 20 కోట్లతో ఇక్కడే ఆ సేవలను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు శుభవార్త చెప్పారు. ధర్మారం, చొప్పదండి వంటి దూర ప్రాంతాల నుండి కూడా రోగులు పెద్దపల్లి ఆసుపత్రికి స్వచ్ఛందంగా తరలివస్తున్నారంటే ఇక్కడ అందుతున్న వైద్య సేవల నాణ్యత ఏపాటిదో అర్థమవుతోందన్నారు.

తెలంగాణలోని 33 జిల్లా ఆసుపత్రుల్లో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అగ్రస్థానంలో నిలవడానికి కృషి చేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీదర్, వైద్యులు, సిబ్బంది, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీదర్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కోరుట్ల నియోజకవర్గంలో వైద్య సేవల బలోపేతానికి ఎమ్మెల్యే సంజయ్ 19 ప్రతిపాదనలు

మొదటి పేజీ తరువాయి...

కోరుట్ల ఏరియా ఆసుపత్రి, మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యాధునిక వైద్య పరికరాలు, ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, సర్జికల్ పరికరాలతో పాటు ఆక్సిజన్ జనరేటర్, ఓటీ హైడ్రాలిక్ టేబుల్స్, ఓటీ లైట్లు వంటి సదుపాయాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వైద్యులు, స్పెషలిస్టులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్, సాంకేతిక, పరిపాలనా సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్యను పెంచాలని సూచించారు. కోరుట్ల 100 పడకల ఏరియా ఆసుపత్రికి అవసరమైన క్యాడర్ స్ట్రెంగ్త్ పెంచడం, మెట్‌పల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.



నూతన ఆసుపత్రి భవనం ప్రారంభానికి ముందే అవసరమైన సిబ్బంది, బెడ్లు, ల్యాబ్ సదుపాయాలు, వైద్య పరికరాలు, మందులు, ఫర్నిచర్‌తో పాటు ప్రత్యేక అంబులెన్స్, సెంట్రలైజ్డ్ ఆక్సిజన్ పైప్‌లైన్, బోర్‌వెల్లు, ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల పూర్తి కోసం అదనపు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మాధాపూర్‌లో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వినతులను సానుకూలంగా పరిశీలించిన మంత్రి దామోదర రాజనర్సింహ, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల తెలిపారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా వైద్య-ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

మొదటి పేజీ తరువాయి...

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు సీఎం తెలిపారు. సాధ్యమైనంత త్వరగా తెలంగాణకు ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఎల్‌నినో నేపథ్యంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ)లో (వీబీ జీ రామ్ జీ) అదనపు పనులు చేర్చాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వర్షాభావంతో పనులు లేనందున ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలకు జీవనోపాధులు మెరుగుపర్చేందుకు, పంటల వైవిధ్యీకరణ ప్రోత్సాహానికి అదనపు పనులను చట్టంలో చేర్చాలని సీఎం కోరారు. రైతులు తమ భూముల్లో కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల అభివృద్ధి, మల్బరీ తోటల సాగు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, ఇళ్ల సమీపంలో ఆకు కూరలు, కూరగాయల తోటలు, వెదురు వనాలు పెంచుకునే పనులను వీబీ జీ రామ్ జీలో చేర్చాలని కేంద్ర మంత్రి చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కొండ ప్రాంతాలతో పాటు కొండ వాలుల్లో నీటి నిల్వ చేసుకునే కందకాలు, ఇప్పటికే ఉన్న ప్లాంటేషన్లు, పండ్ల తోటల్లో తేమ రక్షణకు కందకాల నిర్మాణం, వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులు వీబీ జీ రామ్ జీలో చేపట్టాలని కేంద్ర మంత్రిని కోరారు. ఉపాధి హామీ పథకం కింద ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో 90 రోజుల వరకు పనులు చేసే అవకాశంఉండేదని సీఎం తెలిపారు. వీబీ జీ రామ్ జీ లోనూ అందుకు అనుమతి ఇప్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. స్థానిక అవసరాలకు తగినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే ఇతర పనులను వీబీ జీ రామ్ జీలో చేర్చాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, సురేష్ షెట్కార్, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ ఉన్నారు.

# పేపర్ లీక్ ఆందోళనలో విద్యార్థులకు భారీ ఊరట

మొదటి పేజీ తరువాయి...

జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. విద్యార్థులు, సీజేపీ ఆందోళనలో దాదాపు 200 మంది పోలీసులు గాయపడ్డారని, ఇది సాధారణ విషయం కాదని ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో పోలీసులు లాఠీచార్జ్ చేయడం, గుంపును అదుపు చేసేందుకు టియర్ గ్యాస్ షెల్స్ సైతం ఉపయోగించిన వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. మంగళవారం (జులై 28) ఈ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరగగా.. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలని, బాధ్యులను కూడా తేల్చాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ మాట్లాడుతూ.. 'ప్రారంభంలో ఉద్యమం ప్రశాంతంగా సాగుతుండగా, ఒక్కసారిగా హింస చెలరేగింది. దీనికి రెండు కారణాలు ఉండవచ్చు. మొదటిది పోలీసులు అతిగా కఠినంగా వ్యవహరించడం, రెండోది హింసను ప్రేరేపించాలనుకునే వ్యక్తులు నిరసనకారులలోకి ప్రవేశించడం' అని అన్నారు. ఒకసారి ప్రొటోకాల్ తయారైతే, బాధ్యతను ఖరారు చేయడం సులభమవుతుందని ఆయన చెప్పారు. నిరసనలు జరిగిన అన్ని రాష్ట్రాలను నిరసనలకు సంబంధించిన సిసిటివి ఫుటేజ్, డ్రోన్ రికార్డింగ్‌లు, బాడీ-కెమెరా ఫుటేజ్, వైర్‌లెస్ కమ్యూనికేషన్ రికార్డులు, పిసిఆర్ లాగ్‌లు, ఇతర డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. నిరసనకారు లపై సేకరించిన ఎలాంటి డిజిటల్ డేటానైనా భద్రపరచాలని, అయితే దానిని బయటపెట్టకూడదని కూడా ఆదేశించిందినేర చరిత్ర ఉన్న వ్యక్తులకు ఈ రక్షణ వర్తించదని పేర్కొంటూనే, ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని అధికారులను ధర్మాసనం నిరోధించింది.

నమోదైన ఎఫ్ఐఆర్‌లపై విచారణను కొనసాగించడానికి ఢిల్లీ ప్రభుత్వానికి అనుమతినిచ్చిన సుప్రీంకోర్టు, ఈ విచారణ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నంత వరకు అర్హులైన నిరసనకార విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని తెలిపింది. పిటిషన్లలో లేవనెత్తిన ఆరోపణలపై ఢిల్లీ, మహారాష్ట్ర, బీహార్, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ చీఫ్ సెక్రటరీల నుండి కూడా ధర్మాసనం సమాధానాలను కోరింది.

# బఫర్ జోన్లో కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

మొదటి పేజీ తరువాయి...

ఈ మేరకు మంగళవారం అంబర్పేట్ మూసి పరివాహక ప్రాంతాన్ని అనిల్ కుమార్ సందర్శించారు. ఈమధ్య కబ్జాకు గురైన బఫర్ జోన్ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మూసి నుండి 100 మీటర్ల వరకు నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవని, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఎవరైనా సరె అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని సూచించారు. అక్కడినుండి హమ్మద్ నగర్ సిసి రోడ్డు వరకు 50మీటర్లు ప్రభుత్వ భూమిగా అధికారులు మ్యాక్షిమం ఫ్లడ్ లెవల్ (ఎంఎఫ్ఎల్)ఏర్పాటు చేసినట్టుగా గుర్తించారు. అంబర్పేట్ డంపింగ్ యార్డ్ ముందు బఫర్ జోన్ లో కబ్జాలకు పాల్పడుతూ కబ్జాకోరులు రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టే క్రమంలో స్థానికుల ఫిర్యాదు మేరకు, వార్తా పత్రికల్లో కథనాలకు స్పందించి రెవెన్యూ అధికారులు కూల్చివేసినట్టుగా స్థానిక నాయకులు ఇరిగేషన్ అధికారి దృష్టికి తెచ్చారు. ఇదే క్రమంలో బఫర్ జోన్ కు సంబందించి స్థానిక నాయకులు రెవెన్యూ అధికారులను వివరాలు కోరగా సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ఈ మధ్యనే కబ్జాకోరులపై కోర్టులో కేసు కూడా వేయడం జరిగిందని స్థానిక నాయకులు అధికారులకు వివరించారు. ఇరిగేషన్, రెవెన్యూ, వాటర్ భాడీ జోన్ అధికారుల బృందంతో సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. వీరితోపాటు మహమ్మద్ హుస్సేన్ ఉద్దీన్, షేక్ జమీర్, మహమ్మద్ ఇమ్రాన్ ఉన్నారు.

### రైతు చెంతకు నూతన సాంకేతికతను చేరవేయడమే

# 'రైతునేస్తం' లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

మరియు ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రైతునేస్తం కార్యక్రమం 100వ ఎపిసోడ్ విజయవంతంగా పూర్తవడానికి సహకరించిన రైతులకు, శాస్త్రవేత్తలకు, అధికారులకు అభినందనలు తెలిపారు. రైతులు నేరుగా శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పొందేందుకు రైతునేస్తం ఒక అద్భుతమైన వేదికగా నిలిచిందన్నారు. ప్రస్తుత ఎల్-నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ రూపొందించిన కంటింజెన్సీ ప్రణాళిక ప్రకారం రైతులకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, ఇతర సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపయోగంగా వదిలేసిన రైతువేదికలను రైతులకు ఉపయోగపడే విజ్ఞాన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు ఒకే వేదికపై ప్రత్యక్షంగా చర్చించే అవకాశాన్ని కల్పించడం ద్వారా రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. 2024 మార్చి 6న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమైన రైతునేస్తం కార్యక్రమం నేటితో 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకోవడం రైతుల విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు 24,85,581 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొనగా, వారిలో 5,26,107 మంది మహిళా రైతులు ఉన్నారని తెలిపారు. రెండేళ్ల కాలంలో 2,43,830 మంది అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా, మొత్తం 27.30 లక్షలకు పైగా రైతులు కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారని వెల్లడించారు. రైతువేదికలను డిజిటల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం చేసి రైతులతో ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలను కలిపిన కార్యక్రమం దేశంలోనే ఇదే తొలిసారని మంత్రి పేర్కొన్నారు. ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించే రైతునేస్తం ద్వారా రైతులు అడిగే ప్రశ్నలకు అదే సమయంలో శాస్త్రవేత్తల నుంచి సమాధానాలు లభిస్తున్నాయని, దీనివల్ల పంటలకు నష్టం కలగకముందే సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం రైతులకు లభిస్తోందని మంత్రి వివరించారు. ప్రపంచంతో పోటీపడే వ్యవసాయం కోసం సాంకేతిక పరిజ్ఞానం అత్యంత అవసరమని మంత్రి అన్నారు. వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవసరాలు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతునేస్తం ద్వారా రైతులకు వాతావరణ హెచ్చరికలు, జిల్లాల వారీగా అనువైన పంటలు, శాస్త్రీయ సాగు విధానాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఒకవైపు ఎల్-నినో ప్రభావం, మరోవైపు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్న మంత్రి, ఇలాంటి పరిస్థితులను ప్రభుత్వం, రైతులు కలిసి సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతును రాజుగా తీర్చిదిద్దడమే రైతునేస్తం కార్యక్రమం లక్ష్యమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో నీటి లభ్యత మరింత సవాలుగా మారే అవకాశాలు ఉన్నందున అధిక నీరు అవసరమయ్యే పంటల కంటే ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలను రైతులు పరిశీలించాలని సూచించారు. బోర్ల కింద, ప్రాజెక్టుల కింద ఏ ప్రాంతంలో ఏ పంటలు అనుకూలమో శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగు చేయాలని పిలుపునిచ్చారు. దేశానికి రైతే వెన్నెముక అని, మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకొని శాస్త్రీయంగా వ్యవసాయం చేస్తేనే రైతు ఆదాయం పెరుగుతుందని అన్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సమాచారం ప్రకారం గత వారం కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ, రానున్న రెండు మూడు రోజుల్లో అల్పపీడన ప్రభావంతో ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని ఆసిఫాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని తెలిపారు. అయితే ఈ వర్షాలతో చెరువులు, ప్రాజెక్టులు నిండే పరిస్థితి లేదని, భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం లేదని చెప్పారు. కాబట్టి రైతులు ఈ వర్షాలను చూసి నీటి అవసరం ఎక్కువగా ఉండే వరి వంటి పంటలను విస్తృతంగా సాగు చేయవద్దని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని జిల్లా, మండలాల వారీగా రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సాధారణంగా జూలై నెలలో 218 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈ ఏడాది కేవలం 150 మిల్లీమీటర్లు మాత్రమే నమోదై 27 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. సెప్టెంబర్ నెలలో వర్షాలు మరింత తగ్గే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు ఆదర్శ రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి రైతు రామకృష్ణ మాట్లాడుతూ తక్కువ నీరు, తక్కువ ఎరువులతో అధిక ఆదాయం సాధించే శాస్త్రీయ పద్ధతులను రైతునేస్తం ద్వారా నేర్చుకుంటున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన రాంరెడ్డి మాట్లాడుతూ తాను 80 ఏళ్ల వయస్సులోనూ వ్యవసాయం చేస్తున్నానని, రైతునేస్తం ప్రారంభమైనప్పటి నుంచి ఒక్క ఎపిసోడ్ కూడా మిస్ కాలేదని చెప్పారు. రైతు-శాస్త్రవేత్తల మధ్య ప్రత్యక్ష సంభాషణకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. నల్గొండ జిల్లాకు చెందిన అంజిరెడ్డి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని, రైతునేస్తం ద్వారా లభిస్తున్న శాస్త్రీయ సూచనలు తనకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రైతు లావణ్య మాట్లాడుతూ వర్షాధార పంటలకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, కందులు, పెసలతో పాటు ఆవాలు, ధనియాలు వంటి ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఖమ్మం జిల్లాకు చెందిన రైతు సీహెచ్ రామారావు మాట్లాడుతూ ఒకప్పుడు ప్రైవేట్ కండక్టర్‌గా పనిచేసిన తాను, తక్కువ నీటితో బోడ కాకర సాగు ప్రారంభించి ప్రస్తుతం 20 ఎకరాలకు విస్తరించానని తెలిపారు.

# యువత క్రీడలల్లో రాణించాలి

**- ఎస్సై ఉదయ్ కుమార్**

**వాలీబాల్ విజేతలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో సన్మానం**

వెల్గటూర్, జులై 28, ప్రజాకలం ప్రతినిధి : యువత క్రీడలల్లో రాణించాలని వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా స్థాయి వాలీబాల్




పోటీలలో రాణించి విజేతలుగా నిలిచిన వెల్గటూర్ క్రీడాకారులను వెల్గటూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శాలువ, జ్ఞాపికతో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కుమార్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బాని సై వారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. విద్య, క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని రాణించాలని తెలిపారు. క్రీడాకారులకు పోలీసుల సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, వారికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు తొందరలోనే వారికి జెర్సీలను (క్రీడా దుస్తులను) అందజేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలోనూ వెల్గటూర్ జట్టు ఇదే క్రీడాస్ఫూర్తిని కొనసాగించి గెలుపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు గండ్ర ప్రతాప్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గండ్ర శ్రీకాంత్ రావు, వెల్గటూర్ వాలీబాల్, యూత్ క్లబ్ అధ్యక్షుడు నక్క సురేష్, క్రీడాకారులు మూగల సంతోష్, మ్యాకల్ వికాస్, గుమ్ముల రాహుల్, మోతె సాయి, మంద ప్రేమ్ సాగర్, పోతు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ అద్దె బస్సు

**- జగిత్యాలలో తృటిలో తప్పిన భారీ ప్రమాదం..**

**- భయాందోళనకు గురైన విద్యార్థులు, తల్లిదండ్రులు**



జగిత్యాల ప్రతినిధి 28 (ప్రజాకలం) జగిత్యాల పట్టణంలోని యవర్ రోడ్డులో సోమవారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. దాదాపు 20 మంది విద్యార్థులతో పాఠశాలకు వెళ్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సును ఎదురుగా వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు పాఠశాల బస్సు స్వల్పంగా దెబ్బతినగా, అదృష్టవశాత్తూ విద్యార్థులకు ఎలాంటి తీవ్ర గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన అనంతరం విద్యార్థులు భయాందోళనకు గురికాగా, సమాచారం అందుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పిల్లలను సురక్షితంగా చూసి ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ఆరోపిస్తున్నారు. ప్రమాదం కారణంగా కొంతసేపు యవర్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## పారదర్శకంగా పనికిరాని విద్యుత్, కంప్యూటర్ సామగ్రి వేలం





జగిత్యాల ప్రతినిధి జూలై 28 (ప్రజాకలం) జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వినియోగానికి పనికిరాని విద్యుత్, కంప్యూటర్ సామగ్రికి నిర్వహించిన బహిరంగ వేలం పారదర్శకంగా ముగిసింది. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ చేతన్ నితిన్ పర్యవేక్షణలో యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించారు. వేలం ద్వారా వచ్చిన మొత్తం ఆదాయాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఖాతాలో జమ చేయనున్నట్లు అదనపు ఎస్పీ చేతన్ నితిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, సైదులు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఎస్ఐలు, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

**ఏఎంసీ చైర్మెన్ చెలుకల తిరుపతి**

రుద్రంగి, జూలై 28, (ప్రజాకలం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. భూముల రీ సర్వేలో భాగంగా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మెన్ చెలుకల తిరుపతి



మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల రీ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా భూ సరిహద్దులపై ఉన్న వివాదాలు తగ్గడంతో పాటు, ఖచ్చితమైన భూ రికార్డులు రూపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంఆర్వో పుష్పలత మాట్లాడుతూ.. రైతులకు సంబంధించిన భూ పత్రాలు సిద్ధంగా ఉంచుకుని సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. రీ సర్వే పూర్తయిన అనంతరం భూముల వివరాలు పారదర్శకంగా నమోదు చేయబడతాయని, భవిష్యత్‌లో భూములకు సంబంధించిన సమస్యలు తగ్గుముఖం పడుతాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి

**కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ అమలు చేయాలి**

**వీబీజీఆర్ఏఎం నిధులతో శాశ్వత ఆస్తుల నిర్మాణంపై దృష్టి**



జగిత్యాల ప్రతినిధి జులై 28 (ప్రజాకలం)

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకొని సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను, సర్పంచ్‌లను ఆదేశించారు. మంగళవారం కోరుట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, గ్రామీణ పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వీబీజీఆర్ఏఎం నిధుల వినియోగంపై సర్పంచ్‌లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల సిద్ధిపేట, ఖమ్మం జిల్లాల్లో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ప్రారంభమయ్యాయని, భవిష్యత్తులో జగిత్యాల జిల్లాలో కూడా ప్రత్యేక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను సుప్రీంకోర్టు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా మార్గదర్శకాల అమలుపై చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లను పూర్తి స్థాయిలో వినియోగిస్తూ చెత్తను పొడి వ్యర్థాలు, తడి వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, వైద్య వ్యర్థాలు అనే నాలుగు విభాగాలుగా తప్పనిసరిగా వర్గీకరించాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి చెత్త వర్గీకరణపై విస్తృత అవగాహన కల్పించాలని, రాబోయే నెల రోజుల పాటు గ్రామసభల ద్వారా నిత్య చెత్త సేకరణ, వ్యర్థాల వేరు చేసే విధానాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం వర్గీకరించని చెత్తను సేకరించబోమనే విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు ఘన వ్యర్థాల నిర్వహణలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చిన కలెక్టర్, మండల అభివృద్ధి అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వీబీజీఆర్ఏఎం నిధులను కేవలం రహదారులు, డ్రైన్లకే కాకుండా పాఠశాల ప్రహరీ గోడలు, గ్రామపంచాయతీ భవనాలు, సైన్స్ ల్యాబ్‌లు, ఇతర శాశ్వత మౌలిక వసతుల నిర్మాణానికి వినియోగించాలని సూచించారు. గ్రామాభివృద్ధి పనులను ముందస్తు ప్రణాళికతో చేపట్టి శాశ్వత ఆస్తుల సృష్టికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి

**: కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా పైడిమడుగులో ఫార్మ్‌పాండ్, రీచార్జ్ బోర్‌వెల్ పనులకు భూమిపూజ - జోగిన్‌పెల్లిలో అభివృద్ధి పనుల తనిఖీ**



జగిత్యాల ప్రతినిధి జులై 28 (ప్రజాకలం)

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగం చేసుకుని భూగర్భ జలాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణ జలసిరి కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మంగళవారం కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్న ఫార్మ్‌పాండ్‌కు కలెక్టర్ భూమిపూజ చేశారు. అనంతరం రీచార్జ్ బోర్‌వెల్ మరియు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామంలో చేపడుతున్న కమ్యూనిటీ సోక్‌పిట్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో పరిస్థితుల కారణంగా ప్రతి వర్షపు నీటి బొట్టును భూగర్భంలోకి ఇంకించి నీటి నిల్వలను పెంచడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీ.బీ.జీ.ఆర్.ఏ.ఎం నిధులతో గ్రామాల్లో ఫార్మ్‌పాండ్లు, సోక్‌పిట్లు, ఉట్టకుంటలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ పొలాల్లో ఫార్మ్‌పాండ్లు నిర్మించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఫార్మ్‌పాండ్ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం వల్ల పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందుబాటులో ఉండటమే కాకుండా, భూగర్భ జలాల మట్టం పెరిగి కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు దోహదపడుతుందని వివరించారు. అనంతరం కోరుట్ల మండలం జోగిన్‌పెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న వీవో భవనం మరియు అంగన్‌వాడీ కేంద్రం పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండరాదని, అన్ని నిర్మాణాలు నాణ్యతతో పూర్తి కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# దాసరి ధర్నా రాజకీయ లబ్ధి కోసమే

**అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ దుష్ప్రచారం - కాంగ్రెస్ నాయకుల ధ్వజం**



పెద్దపల్లి, జూలై 28: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చేపట్టిన ధర్నా పూర్తిగా రాజకీయ లబ్ధి కోసమేనని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లారెడ్డి, నాయకులు మినుపాల రామారావు, చిలక సతీష్‌లు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేస్తున్న అభివృద్ధి, ప్రభుత్వ వైపు నుంచి ఆయనకు మంత్రి హోదా దక్కిందనే అక్కసుతోనే దాసరి మనోహర్‌రెడ్డి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే సమయంలో తాలు పేరుతో విపరీతంగా కటింగ్‌లు పెట్టి అన్నదాతల ఉసురు పోసుకున్న ఘనత ఆ పార్టీదేనని ఎత్తిచూపారు. నేడు కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ఎరువుల ధరల్లో మార్పులు చోటుచేసుకుంటే ఆ నెపాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై మోపడం వారి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో కరెంట్ కోతలతో రైతులు అల్లాడిపోగా, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తోందని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, బ్యారేజీల కుంగుబాట్లకు గత ప్రభుత్వ హయాంలో జరిగిన నాణ్యతా లోపాలు, తీవ్రమైన అవినీతే ప్రధాన కారణమని, ఆ వైఫల్యాల బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ నమ్మబోరని స్పష్టం చేశారు. ఎన్నికల ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తూ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా ఇటువంటి కుట్ర రాజకీయాలను వీడి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సహకరించాలని, లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఈర్ల స్వరూప-సురేందర్, ఉనుకొండ లక్ష్మీ-వైకుంఠం, తూముల సుభాష్, శ్రీకాంత్‌తో పాటు నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్ల ఆక్రమణలపై మున్సిపాలిటీ దృష్టి

**- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు**

**- కూరగాయల మార్కెట్‌లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ**

**- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని వీధి వ్యాపారులకు హెచ్చరిక**



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 28 (ప్రజాకలం) మున్సిపల్ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో రోడ్లపై వీధి వ్యాపారులు వ్యాపారం నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంత రాయం ఏర్పడుతున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ మంగళవారం స్వయంగా మార్కెట్‌ను పరిశీలించారు. రోడ్లపై కూర్చొని వ్యాపారం చేస్తున్న వీధి వ్యాపారులను వెనుకకు జరిపించి క్రమబద్ధంగా వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వీధి వ్యాపారులు ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా నిర్ణయించిన ప్రదేశాల్లోనే వ్యాపారం నిర్వహించాలని సూచించారు. అలాగే, దుకాణ యజమానులు రోడ్లపై ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసి వీధి వ్యాపారులకు ఆటంకం కలిగిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తోపుడు బండ్లపై రోడ్లను ఆక్రమించి వ్యాపారం నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ముజీబ్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కథలాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**- మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, విద్యా బోధనపై సమీక్ష**

**- నాణ్యమైన విద్యతో పాటు సురక్షిత వాతావరణం కల్పించాలి**




జగిత్యాల ప్రతినిధి జూలై 28 (ప్రజాకలం):

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, వంటశాల నిర్వహణను పరిశీలించారు. పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో పాఠశాల ఇంచార్జ్ హెచ్ ఎం ఎస్. వెంకటేశం, మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానం - ఆర్టిస్ట్ అశోక్ ఆదర్శం

ఇబ్రహీంపట్నం జూలై 28 (ప్రజా కలం ప్రతినిధి)

ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ మానవసేవయే మాధవసేవ అనే భావనతో సమాజసేవలో ముందుంటున్న వేములకుర్తి గ్రామానికి చెందిన తపాల శాఖ బంట్రోత్, చిత్రకారుడు కోటగిరి అశోక్ మరోసారి తన సేవా తత్వాన్ని చాటుకున్నారు. అత్యవసర శస్త్రచికిత్స కోసం రక్తం అవసరమైన గర్భిణీకి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామానికి చెందిన ఓ గర్భిణీ యువతికి అత్యవసర శస్త్రచికిత్స నిమిత్తం ఏ పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయం తెలుసుకున్న కోటగిరి అశోక్ వెంటనే స్పందించి మంగళవారం మెట్ పల్లి పట్టణంలోని రాజ్ఞ రక్తకేంద్రానికి చేరుకుని రక్తదానం చేశారు. సకాలంలో రక్తం అందడంతో వైద్యులు చికిత్సను విజయవంతంగా నిర్వహించగా, రక్తం స్వీకరించినవారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ రీత్యా తపాల శాఖలో బంట్రోత్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్, ప్రవృత్తి రీత్యా చిత్రకారుడిగా కూడా మంచి గుర్తింపు పొందారు. సమాజసేవ పట్ల ప్రత్యేక ఆసక్తితో వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ అవసరమైన వారికి తన వంతు సహాయం అందిస్తున్నారు. ఈ రక్తదానంతో ఆయన తన 9వ స్వచ్ఛంద రక్తదానాన్ని పూర్తి చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, యువజన సంఘాల నాయకులు, స్నేహితులు కోటగిరి అశోక్‌ను అభినందించారు. రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని అశోక్ పిలుపునిచ్చారు. యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.



ప్రజా కలం

# అవినీతికి అడ్డుకట్ట వేస్తేనే సమ్మిళిత అభివృద్ధి సాధ్యం

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా అవినీతి నిరోధక సంస్థలు చేపడుతున్న చర్యలు సమస్య తీవ్రతను మరోసారి వెలుగులోకి తెచ్చాయి. ఇటీవల తెలంగాణలో హైదరాబాద్ చీఫ్ ఇంజనీర్‌పై అక్రమాస్తుల కేసు నమోదు చేసి, సుమారు రూ.9.24 కోట్ల విలువైన ఆస్తులు, బంగారం, వెండి, స్థిరాస్తులను అవినీతి నిరోధక శాఖ స్వాధీనం చేసుకుంది. అలాగే మహారాష్ట్రలో విద్యుత్ పంపిణీ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్‌ను రూ.3,50,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్టు చేశారు. ఇలాంటి ఘటనలు అవినీతి కేవలం దిగువ స్థాయి కార్యాలయాలకే పరిమితం కాదని, వివిధ స్థాయిల్లో ప్రభుత్వ వ్యవస్థను ప్రభావితం చేస్తోందని సూచిస్తున్నాయి. అవినీతికి పాల్పడిన అధికారులపై వేగవంతమైన దర్యాప్తు, అక్రమాస్తుల స్వాధీనం, కఠిన శిక్షలు అమలు చేసినప్పుడే ప్రజల్లో చట్టంపై విశ్వాసం పెరిగి, పారదర్శక పరిపాలన బలోపేతం అవుతుంది. రాజకీయ నాయకుల హామీలు, ఎన్నికల వాగ్దానాలు, పాలనపై చేసే గొప్ప ప్రకటనలు ఎలా ఉన్నప్పటికీ, దేశంలో పారదర్శకమైన పరిపాలనను నెలకొల్పడానికి, నాణ్యమైన పౌరసేవలను అందించడానికి, సమ్మిళిత అభివృద్ధిని సాధించడానికి అవినీతి ఇప్పటికీ అతిపెద్ద అడ్డంకిగా నిలుస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం పట్ల ప్రజల విశ్వాసానికి పారదర్శకత, జవాబుదారీతనం, నిజాయితీ పునాదులు. ఈ పునాదులనే అవినీతి క్రమంగా బలహీనపరుస్తోంది. అంతర్జాతీయ సంస్థ ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్ ప్రకారం, ప్రపంచంలోని 182 దేశాల్లో భారత్ 39 పాయింట్లతో 91వ స్థానంలో నిలవడం ఆందోళన కలిగించే అంశం. 100 మార్కులకు గాను కేవలం 39 పాయింట్లు మాత్రమే రావడం ప్రభుత్వ రంగంలో ఇంకా వ్యవస్థాగత లోపాలు కొనసాగుతున్నాయనే విషయాన్ని సూచిస్తోంది. అదే సంస్థ నిర్వహించిన గ్లోబల్ కరప్షన్ బారోమీటర్ సర్వేలో 89 శాతం మంది భారతీయులు ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి తీవ్రమైన సమస్యగా ఉందని అభిప్రాయపడగా, 39 శాతం మంది వివిధ ప్రభుత్వ సేవల కోసం లంచాలు చెల్లించాల్సి వచ్చిందని వెల్లడించారు. ఈ గణాంకాలు సమస్య తీవ్రతను మాత్రమే కాకుండా, ప్రజల అనుభవాలను కూడా ప్రతిబింబిస్తున్నాయి. అవినీతి వల్ల కలిగే నష్టం కేవలం ప్రభుత్వ ఖజానాకు జరిగే ఆర్థిక నష్టానికే పరిమితం కాదు. అది దేశ అభివృద్ధి సామర్థ్యాన్నే దెబ్బతీసే సామాజిక, ఆర్థిక, పరిపాలనా సంక్షోభంగా మారుతోంది. విద్య, వైద్యారోగ్యం, సురక్షిత తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వంతెనలు, ప్రజా రవాణా వంటి మౌలిక సేవల నాణ్యతపై దీని ప్రభావం ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ప్రజల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగానికి గురికావడం, ప్రాజెక్టులు అనవసరంగా ఆలస్యం కావడం, వ్యయాలు విపరీతంగా పెరగడం తరచూ కనిపించే పరిణామాలు. అధికారిక రికార్డుల్లో భారీ వ్యయం చూపించినప్పటికీ, క్షేత్రస్థాయిలో నాసిరకం పనులు, అరకొర సౌకర్యాలు మాత్రమే మిగులుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలను విస్మరించి నిర్మించిన రహదారులు, వంతెనలు కొద్దికాలానికే దెబ్బతిని ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ప్రజాధనం పక్కదారి పట్టడం వల్ల కొత్త అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన వనరులు తగ్గిపోతాయి. పెరిగిన ప్రాజెక్టు వ్యయం చివరికి పన్ను చెల్లించే ప్రజలపైనే అదనపు భారంగా పడుతుంది. ఉద్యోగ నియామకాలు, ప్రభుత్వ కాంట్రాక్టులు, టెండర్లు, కొనుగోళ్లలో పారదర్శకత లోపిస్తే ప్రతిభ, అర్హతలకు బదులుగా అక్రమ మార్గాలకు ప్రాధాన్యం పెరుగుతుంది. ఫలితంగా నిజాయితీగా పోటీ పడే వ్యక్తులు, సంస్థలు నిరుత్సాహానికి గురవుతాయి. దేశీయ, విదేశీ పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతిని పెట్టుబడులు తగ్గితే పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక వృద్ధి కూడా మందగిస్తాయి. అవినీతి ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని బలహీనపరచి ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. సామాజిక కోణంలో చూస్తే అవినీతి అసమానతలను మరింత పెంచుతుంది. ఆర్థిక, రాజకీయ ప్రభావం ఉన్నవారు ప్రభుత్వ సేవలను సులభంగా పొందగలిగితే, సాధారణ పౌరుడు తన హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. సంక్షేమ పథకాల లబ్ధి కూడా అర్హులకు కాకుండా ప్రభావశీలులకు చేరే పరిస్థితులు ఏర్పడతాయి. దీనివల్ల చట్టం ముందు అందరూ సమానులే అనే రాజ్యాంగ సూత్రం బలహీనపడటమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం కూడా దెబ్బతింటుంది. అక్రమాలకు పాల్పడినవారు శిక్షల నుంచి తప్పించుకుంటున్నారనే భావన పెరిగితే వ్యవస్థ పట్ల నిరాశ, నిస్పృహ, నైతిక విలువల పతనం మరింత వేగవంతమవుతాయి. అవినీతి నిర్మూలన అనేది ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; అది సమాజం మొత్తానికి సంబంధించిన బాధ్యత. డిజిటల్ సేవల విస్తరణ, ఈ-గవర్నెన్స్, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్, సమాచార హక్కు చట్టం వంటి సంస్కరణలు పారదర్శకతను పెంచుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కఠినమైన అమలు, స్వతంత్ర దర్యాప్తు వ్యవస్థలు, త్వరితగతిన న్యాయ ప్రక్రియలు, బాధ్యులపై నిర్దాక్షిణ్యమైన చర్యలు లేకుంటే ఆశించిన ఫలితాలు సాధ్యం కావు. ప్రభుత్వ వ్యవస్థలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం, టెండర్లు, కొనుగోళ్లు, నియామకాల్లో పూర్తి పారదర్శకత తీసుకురావడం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణను విస్తరించడం, అవినీతిని వెలుగులోకి తీసుకొచ్చే సమాచారదాతలకు రక్షణ కల్పించడం వంటి చర్యలు సమాంతరంగా కొనసాగాలి. సుస్థిరమైన, సమ్మిళితమైన అభివృద్ధి సాధించాలంటే అవినీతికి అడ్డుకట్ట వేయడం తప్పనిసరి. ప్రజాధనం ప్రజల సంక్షేమానికే వినియోగించబడినప్పుడే అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరుతాయి. పారదర్శకత, జవాబుదారీతనం, చట్టబద్ధత, నైతిక పాలన బలపడినప్పుడే ప్రజాస్వామ్యం పటిష్ఠమవుతుంది. అవినీతి రహిత పాలన అనేది కేవలం పరిపాలనా లక్ష్యం కాదు; అది దేశ ఆర్థికాభివృద్ధికి, సామాజిక న్యాయానికి, ప్రజల విశ్వాసానికి మూలస్తంభం.

– హెచ్.ప్రతాప్

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షురాలు దబ్బడి చంద్రకళ
- జిల్లా ఉపాధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్



పెద్దపల్లి,జులై 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ సాధన కోసం ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం వెంటనే గుర్తించి,ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు దబ్బడి చంద్రకళ,జిల్లా ఉపాధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు.పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 2001 నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో తాము పడిన కష్టాలను, ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేశారు. ఆనాడు జైలు జీవితాలు గడుపుతూ, కుటుంబాలను పోషించుకోలేక, పశువులు మరియు ఇళ్లలోని మూగజీవాలు చనిపోయే దయనీయ పరిస్థితుల్లోనూ సొంత నగలు అమ్ముకొని ఉద్యమాన్ని కొనసాగించామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యమకారులను ఆదుకుంటామని, జార్ఖండ్ రాష్ట్రం మాదిరిగా పింఛన్లు,ఇళ్లు, 250 గజాల ఇంటి స్థలాలు ఇస్తామని సోనియా గాంధీ,రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి తదితరులు ఎన్నికల సమయంలో స్పష్టమైన హామీలు ఇచ్చారని వారు గుర్తుచేశారు.

ఆ మేనిఫెస్టో హామీలను నమ్మి తాము కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ, ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం కేకే అధ్యక్షతన శోభన్ రెడ్డి,రాములు నాయక్,పొన్నం ప్రభాకర్,అద్దంకి దయాకర్ తదితరులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమే అయినప్పటికీ,ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని కోరారు.ప్రస్తుతం అనేక మంది ఉద్యమకారులు పూట గడవని దుస్థితిలో ఉన్నారని,రాబోయే పండుగల నాటికి ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు తక్షణమే గుర్తింపు కార్డులు అందజేసి,ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలోతెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండీ ఖతీజా,ఆలేటి ఎల్లమ్మ, గడ్డం లక్ష్మి,మొలుగూరి నర్సయ్య,పెర్క రాయమల్లు,ఈదునూరి శంకర్,బోసేలి శాంత,తదితరులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి

- మెట్ పల్లి ఆర్‌డీవో జి.నర్సింహారావు
- మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం



మెట్‌పల్లి రూరల్, జూలై 28:(ప్రజా కలం);

మెట్‌పల్లి మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో కృషి చేయాలని స్థానిక ఆర్‌డీవో జి. నర్సింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం మెట్‌పల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారుల, వివిధ గ్రామాల సర్పంచుల సమక్షంలో మండల స్థాయి అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మండలంలోని పలు గ్రామాభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఆర్‌డీవో విస్తృతంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్పంచులు తమ తమ గ్రామాలలో గల విద్యుత్, మిషన్ భగీరథ, గవర్నమెంట్ పాఠశాలలో చేరిన పిల్లలకి ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం టీసీలు ఇవ్వకపోవడం గురించి, అంగన్వాడీలో అందిస్తున్న గుడ్ల సైజు గురించి, సీజనల్ వ్యాధుల గురించి, సత్తక్కపల్లి కుందేలు గుట్ట అక్రమ కబ్జా గురించి, కోనరావుపేట కోళ్ల ఫారాల గురించి, మెట్ పల్లి రూరల్ కు ఆరు సంవత్సరాలుగా విద్యుత్ ఏఈ లేకపోవడం ఇన్చార్జి ఏఈ కొనసాగడం గురించి, ఆత్మకూర్ మత్తడి గురించి, కోనరావుపేట వరద కాలువ గేటు గురించి, మెట్ల చిట్టాపూర్ లో వరద కాలువ భూములకు కబ్జా గురించి, పెద్దాపూర్ లో కాలువ గురించి, వెల్లుల్లాలో తూము గురించి,అక్రమ మట్టి తవ్వకాల గురించి, సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వి. మహేందర్ రెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్పీవో) చెన్న రాజేంద్రప్రసాద్, మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) బండి ప్రదీప్ కుమార్, తహసీల్దార్ (ఎంఆర్‌వో), డాక్టర్ అంజిత్ రెడ్డి, ఏఓ దీపిక, ఆత్మకూర్ వెటర్నరీ డాక్టర్ అశ్విని, ఎంఈఓ కనకధార వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోదాముల వేదికగా కోట్ల కుంభకోణం

బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి

వెలుగులోకి రూ.700 కోట్ల వడ్ల అవినీతి బాగోతం – ఈడీ, సీబీఐ దర్యాప్తునకు బీజేపీ డిమాండ్



పెద్దపల్లి,జూలై 28(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి నియోజకవర్గంలో హెచ్ అండ్ టీ గోదాముల ద్వారా కేవలం ఒకే సంవత్సరంలో కరీఫ్,రబీ సీజన్ల ధాన్యం కొనుగోళ్లలో సుమారు రూ.700 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని,స్థానిక ఎమ్మెల్యే అండదండలతో రైస్ మిల్లర్లు,గోదాం నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై రైతులను తీవ్రంగా దోచుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి ఆరోపించారు.మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎస్.ఆర్.గార్డెన్స్ లో బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గొట్టిముక్కుల సురేష్ రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం నుంచి గోదాం వరకు,వడ్ల గింజ బియ్యంగా మారే ప్రతి దశలోనూ వ్యవస్థీకృత దోపిడీ జరుగుతోందని మండిపడ్డారు.ఎఫ్‌సీఐ అన్ని రకాల ఖర్చులు భరిస్తున్నప్పటికీ, క్వింటాళ్లకు లెక్కింపు పేరుతో ప్రతి 290 క్వింటాళ్ల లోడ్‌కు రూ.18వేల చొప్పున అక్రమంగా వసూలు చేస్తూ రైతులపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల అండతోనే రైస్ మిల్లర్లు,గోదాం నిర్వాహకులు కుమ్మక్కై ఒక్కో లారీపై రైతును రూ.18 వేల వరకు నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు.సీఎంఆర్ ధాన్యాన్ని గోదాముల్లో అన్‌లోడ్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎఫ్‌సీఐ నిధులను దుర్వినియోగం చేస్తూ వందల కోట్లు మింగిన ఈ బాగోతంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాలని కోరారు.ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన పక్కా ఆధారాలను ఈడీ,సీబీఐ, విజిలెన్స్ శాఖలతో పాటు కేంద్ర ప్రభుత్వానికి మరియు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తామని సురేష్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఎలాంటి బెదిరింపులకు లొంగకుండా దోషులను శిక్షించే వరకు బీజేపీ తరఫున పోరాటం ఎట్టిపరిస్థితుల్లోనూ ఆగదని హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్,కాసాగోని నిర్మల,మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు రఫీక్,ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు అరుణ్ రంజా,కొల్లూరి సంతోష్,బండారి లత,మెండే శంకరయ్య,కొమ్మిడి రాజేందర్ రెడ్డి,మల్కా భాగ్యలక్ష్మి,ఉషణ అన్వేష్,పెరక రమేష్, ఏనుగు రాజిరెడ్డి,మారం రమేష్,దానరి వెంకటేష్,నల్లవెల్లి శంకర్,వడ్లకొండ శశివర్ధన్,శాలిగంటి కొమురయ్య,దాసరి చందు,వీరగోని కిరణ్,కొత్తూరు సంపత్,సుబ్బని సురేష్, రమేష్ గౌడ్,శేఖర్ మాస్టర్,ఈర్ల ప్రశాంత్,ఈనెంకా వేంకటేష్,కరెంగుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సును ఢీకొన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

జగిత్యాల ప్రతినిధి జూలై 28 (ప్రజాకలం)

జగిత్యాల పట్టణంలోని పికప్ పాయింట్ సమీపంలో విద్యార్థులతో వెళ్తున్న తక్షశిల హై స్కూల్ బస్సును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. తిప్పన్నపేట గ్రామానికి చెందిన చక్రాల సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సుదర్శన్ తక్షశిల హైస్కూల్ బస్సులో విద్యార్థులను తీసుకొని పికప్ పాయింట్ నుంచి కృష్ణనగర్‌లోని పాఠశాలకు వెళ్తుండగా, పాత బస్టాండ్ నుంచి న్యూ బస్టాండ్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు టి ఎస్ 21 టి 2888)ను డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి స్కూల్ బస్సును ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న కొందరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఫిర్యాదు ఆధారంగా రాయికల్ కు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ మారంపల్లి నరేశ్ పై జగిత్యాల టౌన్ ఎస్ఐ ఎం. సుప్రియ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు టౌన్ ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులను తరలించే వాహనాల సమీపంలో వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రెండు రోజులపాటు భారీ వర్షాలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,జూలై 28:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి) వాతావరణ నిపుణులు,క్లైమటాలజిస్టులు అందించిన నివేదికల ప్రకారం పెద్దపల్లి జిల్లాలో 28, 29న భారీ నుంచి అతి భారీ వర్షాలు,కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా చేపట్టాలని సూచించారు.ముఖ్యంగా కంది, పెసర,నువ్వులు,పొద్దుతిరుగుడు,అలసంద,కూరగాయలు, పప్పుధాన్యాలు,చిరుధాన్యాలు వంటి పంటలను సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు విత్తనాలు వేసేందుకు అత్యంత అనుకూల సమయమని,జిల్లా కలెక్టర్ సూచించారు. సకాలంలో విత్తనాలు వేయడం వల్ల నేలలో తగినంత తేమ లభించి పంటలు ఆరోగ్యంగా ఎదిగి మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఆగస్టు 10 వరకు మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ అవి చెరువులు నిండేందుకు,భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపయోగపడవని, వీటిని నమ్ముకుని వరి వంటి పంటలు వేస్తే రైతులు దెబ్బతింటారని ఆరుతడి పంటల సాగుకే రైతులు మొగ్గు చూపాలని కలెక్టర్ సూచించారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ఈ అనుకూల వర్షాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు

కథలాపూర్ రైతు వేదికలో విత్తన మేళా

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన

అదనపు కలెక్టర్ రాజా గౌడ్



జగిత్యాల ప్రతినిధి జులై 28 (ప్రజాకలం) రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన “రైతు వేదికలలో విత్తన మేళా – రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు” కార్యక్రమంలో భాగంగా కథలాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా కుసుమ, పెసర, అనుములు, కందులు, అలసంద, మొక్కజొన్న, ఉల్లి, కూరగాయల విత్తనాల స్టాళ్లను పరిశీలించి వాటి లభ్యత, నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి యోగిత కంది విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ వానాకాలంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక కాంటింజెన్సీ ప్రణాళిక రూపొందించిందని చెప్పారు. ఈ ప్రణాళికలో భాగంగా రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే కంది, పెసర, మినుము, కుసుమ, అలసంద, అనుములు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని ప్రభుత్వం సూచిస్తున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు రైతు వేదికలలో విత్తన మేళాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్, మండల వ్యవసాయ అధికారి యోగిత, మండల పంచాయతీ అధికారి (ఎంపీవో), వివిధ గ్రామాల సర్పంచులు, వ్యవసాయ విస్తరణ అధికారులు హరీష్, సంధ్య, మౌనిక, సుష్మశ్రీ, రాఘవేంద్ర, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# అధ్యక్షుడి కుటుంబానికి సంఘం చేయూత

**మానవత్వం చాటుకున్న అభ్యుదయ పరపతి సంఘ సభ్యులు**

(వరంగల్/పర్వతగిరి) జులై 28, ప్రజాకలం ప్రతినిధి.పర్వతగిరి మండలకేంద్రం అభ్యుదయ పరపతి సంఘం అధ్యక్షులు స్వర్గీయ ఎర్రబెల్లి హరికుమార్ మృతి పట్ల సంఘం సభ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తమ వంతు సహాయంగా చిట్టి సభ్యుల తరపున రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పుల్లూరి రజినీకాంత్ గౌడ్, గౌరవ అధ్యక్షులు బైర్ రాజశేఖర్, శ్రీరాములు కిరణ్, మధ్యబోయిన సంతోష్, జంగా ప్రసాద్, వన్నాల రాజశేఖర్, నాగుల రాజు, ఎర్రబెల్లి సునీల్ కుమార్, యూత్ సభ్యులు శ్రీరాములు అభిషేక్, మడ్డి వంశీ, చీదురాల శివతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరికుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి మనోధైర్యం కలగాలని సభ్యులు ఆకాంక్షించారు.



### స్త్రీ నిధి రుణాల లావాదేవీలు పూర్తిగా

# డిజిటల్ పద్ధతిలోనే జరగాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ
- నూరు శాతం రుణ రికవరీ లక్ష్యంగా సెర్ప్, మెప్మా, స్త్రీ నిధి సిబ్బంది పనిచేయాలి
- స్త్రీ నిధి కమిటీ సమావేశాన్ని నిర్వహించిన అదనపు కలెక్టర్



ఖమ్మం, జూలై 28( ప్రజా కలం న్యూస్)

మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెంది, తమ ఆదాయాన్ని పెంచుకునేలా సకాలంలో రుణాలను అందిస్తూ, నూరు శాతం రికవరీ సాధించేలా స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్త్రీ నిధి కమిటీ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో సిబ్బంది మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేకుండా పరస్పరం అందుబాటులో ఉంటూ మహిళా సంఘాలను బలోపేతం చేయాలని అన్నారు. రుణాల పంపిణీ, రికవరీ ప్రక్రియలో వెనుకబడిన సిబ్బంది పనితీరును అదనపు కలెక్టర్ సమీక్షించారు. క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. వచ్చే నెల నాటికి రికవరీ శాతం ఖచ్చితంగా 60 శాతానికి చేరాలని, రాబోయే సమావేశంలో ప్రగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని అన్నారు.

**'మన స్త్రీ నిధి' యాప్ ద్వారానే రికవరీ**

స్త్రీ నిధి రుణ రికవరీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా సాగడానికి మరియు నిధులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా ఉండేందుకు రికవరీ మొత్తాన్ని పూర్తిగా 'మన స్త్రీ నిధి' యాప్ ద్వారానే సేకరించాలని ఆదేశించారు. యాప్ పై ప్రతి ఎస్.హెచ్.జి (ఎస్ హెచ్ జి) మహిళకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం పట్టణాలలో వార్డుల వారీగా, గ్రామాల్లో వీఓ (వో )ల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మహిళల మొబైల్స్‌లో యాప్ డౌన్‌లోడ్ చేయించి, రికవరీ చేసే విధానాన్ని డెమో (డెమో ) పద్ధతిలో వివరంగా వివరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీరావ్ు మాట్లాడుతూ, గ్రామ సంఘాల్లో స్త్రీ నిధి రికవరీ నిధులను సొంతానికి వాడుకుంటూ దుర్వినియోగానికి పాల్పడిన వీఓఏ (వోఏ )లపై చట్టపరమైన కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి రికార్డులను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశంలో మెప్మా పీడీ, స్త్రీ నిధి రీజనల్ మేనేజర్ జి. రవీందర్ నాయక్, మెప్మా డీఎంసీ, ఏడీఎంసీ, టీఎంసీ, ఐదు టీఎల్ఎఫ్ మెప్మా సిబ్బంది, 20 మండలాల ఏపీఎంలు, స్త్రీ నిధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలను సాగు చేవట్టాలి

- వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రైతులకు నష్టం జరగకుండా ముందస్తు అవగాహన కార్యక్రమాలు
- వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన రైతులు పంటలనే సాగు చేయాలి
- 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ మంత్రి నిర్వహించిన కార్యక్రమంలో రఘునాథపాలెం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న జిల్లా కలెక్టర్.

ఖమ్మం, జూలై 28(ప్రజా కలం న్యూస్ )

రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానాన్ని చేరవేయడంలో "రైతు నేస్తం" కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రఘునాథపాలెం మండలంలోని రైతు వేదికలో పాల్గొని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అందించిన శాస్త్రీయ వ్యవసాయ సూచనలను వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి రైతులకు పలు సూచనలు చేశారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేయాలని అన్నారు. రైతులకు ఎరువులు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తూ ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి ఆదాయం పొందుతున్నారని, ఆయిల్ పామ్ తోటల్లో జాజి, మిరియాలు, కోకో వంటి అంతర పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నీటి యాజమాన్యం, సమగ్ర పంట సంరక్షణ పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు. భూగర్భ జలాల స్థితిని ప్రతిరోజూ రైతులకు తెలియజేసి, ఆ సమాచారాన్ని వ్యవసాయ ప్రణాళికలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆనతరం రైతు వేదిక లో ఏర్పాటు చేసిన విత్తన మేళా ను కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. అక్కడ రైతులకు ప్రస్తుత పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎల్ నినో ప్రభావం వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పద్ధతులకు మాత్రమే పరిమితం కాకుండా శాస్త్రీయ విధానాలను అనుసరించాలని సూచించారు. రైతులకు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే జిల్లాలో అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు స్వల్పకాలిక, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు ఆరుతడి పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ మొత్తం వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. వర్షాలు కురుస్తున్నాయని భావించి నీటిని పూర్తిగా సాగుకు విడుదల చేస్తే, తరువాతి దశలో వర్షాలు తగ్గిన పరిస్థితిలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, ఇప్పటికే జిల్లాలో వర్షపాతం గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. గత అనుభవాల కంటే భిన్నమైన పరిస్థితులు నెలకొన్నందున రైతులు ఆలోచించి పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు.

ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా వినియోగిస్తూ ఉన్నామని, ఇరిగేషన్ శాఖతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ రైతులకు సాధ్యమైనంత మేర సహకారం అందిస్తామని తెలిపారు. వాతావరణ శాఖ అంచనాలు, నీటి లభ్యత, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను అనుసరించి పంటల సాగు చేపడితే రైతులు తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు, అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



- ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం

గద్వాల ప్రతినిధి (ప్రజా కలం జూలై 28)

గద్వాల డిపోలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పరమేశ్వరయ్య అధ్యక్షతన గేట్ మీటింగ్ మరియు సభను నిర్వహించడం జరిగినది. ముఖ్యంగా ఆర్టీసీ కార్మికులు గత కొన్ని రోజుల క్రితం చేసినటువంటి సమ్మె ఫలితంగా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ కార్మికులు పెట్టినటువంటి డిమాండ్లను ఒప్పుకోవడంతో ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలు వచ్చే నెల ఆగస్టులో జరుగుతున్నాయి.

దీని ఫలితంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గము ప్రతి డిపోను సందర్శించి కార్మికులను యూనియన్ ఎలక్షన్లకు సిద్ధపరుస్తున్నది 2019 సంవత్సరంలో గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులు చేసిన 55 రోజుల సమ్మెను నిర్వీర్యం చేసి ఆర్టీసీలో ఉండేటువంటి రాజ్యాంగబద్ధంగా కల్పించినటువంటి యూనియన్లను రద్దుచేసి కార్మికుల పాలిట శాపంగా పరిణమించాడు కానీ గత ఏడు సంవత్సరాలుగా యూనియన్ లేకపోవడం వల్ల కార్మికులు తమ సమస్యలను ఎవరికి చెప్పాలో అర్థం కాక ఆ సమస్యలను పరిష్కరించుకోలేక పెరిగిన కిలోమీటర్ల భారంతో యాజమాన్య ఒత్తిళ్లకు లోనవుతూ అధికారుల వేధింపులకు నరకయాతాలను అనుభవించారు కానీ ఎంప్లాయిస్ యూనియన్ గత ఏడు సంవత్సరాలుగా ఆర్టీసీలో యూనియన్లు రద్దు అయిన తమ వంతు కృషిగా ఏనాడు విశ్రమించకుండా కార్మికుల సమస్యల మీద ఎన్నో పోరాటాలు చేస్తూ యాజమాన్యానికి ప్రభుత్వానికి ఎన్నో లేఖలను రాస్తూ అనేక కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి సమ్మె నోటీసు ఇచ్చి గత నెల ఏప్రిల్ లో జరిగిన మూడు రోజుల సమ్మెలో ఉధృతంగా పాల్గొని ప్రభుత్వ యాజమాన్యాలతో చర్చలు జరిపి ఆర్టీసీలో యూనియన్ల పునరుద్ధరణ రిటైర్ కార్మికుల అలవెన్సు ప్రస్తుతం కార్మికులు అనుభవిస్తున్నటువంటి సమస్యల మీద వారి యొక్క డిమాండ్లు పెడుతూ 2021 పిఆర్సిని ఇప్పిస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి అనే ప్రధానమైన డిమాండ్తో ప్రభుత్వాన్ని ఒప్పించి సమ్మె డిమాండ్లలో భాగంగా ఆర్టీసీలో యూనియన్ ఎలక్షన్లకు గాను ప్రభుత్వ ఉత్తర్వులను ఇచ్చే విధంగా కృషి చేసినది. దీనిలో భాగంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ గద్వాల డిపోకు విచ్చేసి కార్మికులు పడుతున్నటువంటి కష్టాలను వివరిస్తూ వారు సాధించుకున్న సమ్మె డిమాండ్లను కూడా ప్రస్తావిస్తూ సభను ఏర్పాటు చేయడం జరిగినది. ఆ సభలో ముఖ్యంగా రాష్ట్ర నాయకులు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ గోపాల్ , హైదరాబాద్ జోనల్ ప్రెసిడెంట్ వెంకటేష్‌పాల్గొనడం జరిగినది.గద్వాల ఏఐటీయుసి సిపిఐ పార్టీ అధ్యక్షులు గద్వాల డిపో ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్‌ఆంజనేయులు, ఎంప్లాయిస్ యూనియన్ గద్వాల డిపో అధ్యక్షులు గడ్డం కృష్ణారెడ్డి, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బసన్న, డిపో అధ్యక్ష కార్యదర్శులు, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు, సిసిఎస్ అధ్యక్ష కార్యదర్శులు, మహిళా కార్మికులు, మొదలగు వారందరూ పాల్గొని సభను విజయవంతం చేయడం జరిగినది.

### ఎస్సీ డిపార్టుమెంట్ జిల్లా ఉపాధ్యక్షుడిగా

# మల్లెపాక సమ్మయ్య నియామకం

- నాయకులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపిన సమ్మయ్య
- ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు మార్గదర్శకత్వంలో అంకితభావంతో పనిచేస్తానని వెల్లడి



జూలై 28 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మల్లెపాక సమ్మయ్యను వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్టుమెంట్ ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా ఎస్సీ డిపార్టుమెంట్ చైర్మన్ శ్రీనివాస్ ప్రకటించారు. ఈ నియామకం గౌరవ వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మల్లెపాక సమ్మయ్య మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన డీసీసీబీ మాజీ చైర్మన్ మర్నేని రవీందర్ రావు, జిల్లా యువ కాంగ్రెస్ అధ్యక్షుడు కే.ఆర్. దిలీప్ రాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోసాల వెంకన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, జిల్లా అధికార ప్రతినిధి అడ్వకేట్ నిమ్మని శేఖర్ రావు, సీనియర్ నాయకుడు అబ్బిడి రాజిరెడ్డి, అయినవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఏఎంసీ మార్కెట్ చైర్మన్ నడుకుడు వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్ కన్నా, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మాజీ పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తుల్ల రవితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి అంకితభావంతో, స్వార్థరహితంగా నిర్వహిస్తూ ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు సూచనలు, ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని మల్లెపాక సమ్మయ్య స్పష్టం చేశారు.

### ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను

# సందర్శించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్



(వరంగల్/ పర్వతగిరి) జూలై 28, ప్రజాకలం ప్రతినిధి

పర్వతగిరి మండలంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గార్లు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, కూరగాయలు, బియ్యం, నిత్యావసర సరుకులను పరిశీలించి వాటి నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతి, పరిశుభ్రత, తాగునీరు తదితర సౌకర్యాలను పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి ఆహారం నాణ్యత, రుచి, పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల పాఠశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులు దుప్పట్లు కావాలని ఎమ్మెల్యే కి కోరడంతో మంగళవారం వర్ధన్నపేడట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్య శారద గార్ల తో కలిసి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆటలకు అవసరమైన సామాగ్రి కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ రెడ్డి, ఏడిఈ నర్సింగం, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### పర్వతగిరి ఫీల్డ్ అసిస్టెంట్ పై పోలీస్ స్టేషన్లో

# ఫిర్యాదు చేసిన సోదరుడు





(వరంగల్/పర్వతగిరి) జూలై 28, ప్రజాకలం ప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ సొంత తమ్ముడి వ్యవసాయ పనులను అడ్డుకుంటున్నాడంటూ పర్వతగిరి మండలానికి చెందిన రైతు జంగ ప్రసాద్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు జంగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, తమకు వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమిని 14 సంవత్సరాల క్రితం పెద్దమనుషుల సమక్షంలో రెండు భాగాలుగా విభజించి, లక్కీ డ్రా పద్ధతిలో పంచుకున్నారని, అప్పటి నుంచి తన వాటా భూమిని స్వతంత్రంగా సాగు చేసుకుంటూ వస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, తన అన్న జంగ లింగమూర్తి, ప్రస్తుతం పర్వతగిరి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ తన పొలాన్ని దున్నేందుకు వచ్చిన కౌలుదారులను, ట్రాక్టర్ యజమానిని బెదిరించి, అసభ్య పదజాలంతో దూషిస్తూ సాగు పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని, పెద్దమనుషుల అండతో తన వ్యవసాయ మోటార్ వైర్లను కత్తిరించి గత 20 రోజులుగా వ్యవసాయ పనులు సాగకుండా చేసి తీవ్ర ఆర్థిక నష్టం కలిగించారని కూడా ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రైతును ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జంగ ప్రసాద్ పోలీసులను కోరారు.

### చిన్నారిపై లైంగిక దాడి యత్నం..

# ప్రధానోపాధ్యాయుడు అరెస్ట్

### పోక్సో కేసులో రిమాండ్

- ఇంట్లోకి వెళ్లిన నాలుగేళ్ల బాలికపై అసభ్యకర ప్రవర్తన ఆరోపణ
- చిన్నారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు



(వరంగల్ /వర్ధన్నపేట) జులై 28 ప్రజాకలం ప్రతినిది:వర్ధన్నపేట మండలం బండోతపురం గ్రామానికి చెందిన తాటికాయల భాస్కర్ (50), జాఫార్ఘడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలిక ఈ నెల 26న మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో ఆడుకుంటూ భాస్కర్ ఇంట్లోకి వెళ్లినట్లు సమాచారం. కొంతసేపటి తర్వాత బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లి వెతుకుతూ భాస్కర్ ఇంటికి వెళ్లగా, తన కుమార్తెతో నిందితుడు అసభ్యకరంగా ప్రవర్తిస్తూ చిన్నారి ప్రైవేట్ భాగాలను తాకి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. అనంతరం జరిగిన విషయాన్ని బాలిక తన తల్లికి వివరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు తాటికాయల భాస్కర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

## తానూర్ జూనియర్ కళాశాలలో హెపటైటిస్‌పై విద్యార్థులకు అవగాహన



తానూర్, జులై 28(ప్రజా కలం): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ లలిత ముఖ్య అతిథిగా హాజరై, హెపటైటిస్ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరంగా అవగాహన కల్పించారు. డాక్టర్ సూచించిన పలు ఆరోగ్య సూచనలను విద్యార్థులు శ్రద్ధగా విన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికిరణ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల రాకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలి

### – మరిపెడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గుగులోతు రవి

మరిపెడ ప్రజా కలం న్యూస్ జూలై 28

మరిపెడ మండల పరిధిలో ఉచిత వైద్య శిబిరాల ద్వారా 180 మందికి పరీక్షలు నిర్వహించామని మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం మండల పరిధిలోనీ అబ్బాయిపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని దారావత్ తండా గ్రామపంచాయతీతో పాటు, మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్‌లో ఈ ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసామన్నారు.ఈ శిబిరాల్లో జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్ళు నొప్పులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అదేవిధంగా బీపీ, షుగర్, మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి బాధితులకు ఉచితంగా మందులను పంపిణీ చేశాను అదేవిధంగా రెండు ప్రాంతాల్లో



కలిపి మొత్తం 180 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అన్నారు వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దారావత్ తండా సర్పంచ్ దారావత్ తేజ, హెల్త్ సూపర్‌వైజర్ ఆచార్యులు, మీనూలు అనిత, సౌజన్య, ఇాచీవీలు శ్రీదేవి, స్వప్న, ఆశా ఆరోగ్య కార్యకర్తలు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి జూలై 30న వాక్-ఇన్ ఇంటర్వ్యూ

### - ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్

ఖమ్మం, జూలై - 28( ప్రజా కలం న్యూస్ ) ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖమ్మంలో ఔట్సోర్సింగ్ విధానంలో ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ కోసం జూలై 30న ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖమ్మంలోని మెడికల్ సూపరింటెండెంట్ ఛాంబర్ లో వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఫార్మసీ (డి.ఫార్మసీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ (బి.ఫార్మసీ) అర్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన విద్యార్హతల సర్టిఫికెట్ లతో నిర్ణీత సమయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అభివృద్ధి పన్నుల్లో నాణ్యత పాటించాలి

### - ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ



గద్వాల ప్రతినిధి (ప్రజాకలం జులై 28)

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని ఎల్కూర్ గ్రామంలో మంగళవారం ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీ సోక్ ఫిట్లను (సామాజిక ఇంకుడు గుంతలను) ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ప్రభుత్వ అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతి వివరాలను పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు ఆన్లైన్ యాప్ లో అప్ లోడ్ చేసి లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందేలా చూడాలన్నారు. అదేవిధంగా, గ్రామాల్లో మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా, భూగర్భ జలాలు పెరిగేలా నిర్మిస్తున్న సామాజిక ఇంకుడు గుంతల (కమ్యూనిటీ సోక్ ఫిట్ల) నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పన్నుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినోద్ కుమార్, స్థానిక పంచాయతీ కార్యదర్శి సుభావతి,గ్రామ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల నిధులు, గ్రాంట్లపై లోక్‌సభలో స్పష్టతనిచ్చిన కేంద్రం

### పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికి కట్టుబడి ఉన్నట్లు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్

ఖమ్మం జులై 28 (ప్రజాకలం న్యూస్ )

పంచాయతీరాజ్ సంస్థల పనితీరు, నిధుల వివరాలపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో మంగళవారం ప్రశ్నించారు. పలు కీలక అంశాలను లేవనెత్తారు. 16వ ఆర్థిక సంఘం కింద పంచాయతీరాజ్ సంస్థలకు రాష్ట్రాలు సిఫార్సు చేసిన నిధులు, పనితీరు ఆధారిత గ్రాంట్ల వివరాలు తెలపాలని కోరారు. ఆడిట్ ఖాతాలను సమర్పించడంలో జాప్యం, 10 నుంచి 15వ ఆర్థిక సంఘాల వరకు పంచాయతీలకు సిఫార్సు చేసిన గ్రాంట్లు, విడుదలైన నిధుల వివరాలను కోరారు. దీనికి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ లికిత పూర్వక సమాధానం ఇచ్చారు.

**16వ ఆర్థిక సంఘం సిఫార్సులు..**

16వ ఆర్థిక సంఘం కింద పంచాయతీరాజ్ సంస్థలకు సిఫార్సు చేసిన టైర్డ్, అన్‌టైర్డ్ మరియు పనితీరు ఆధారిత గ్రాంట్ల వివరాలను కేంద్ర మంత్రి వెల్లడించారు. 2016-17 నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరాల మధ్య 14వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రాలకు విడుదల చేసిన పనితీరు గ్రాంట్ల వివరాలను తెలిపారు.

**గత ఆర్థిక సంఘాల నిధుల విడుదల..**

10వ మరియు 11వ ఆర్థిక సంఘాల కింద వరుసగా రూ. 3,573.35 కోట్లు, రూ. 6,601.85 కోట్లు పంచాయతీరాజ్ సంస్థలకు విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ప్రకారం పంచాయతీ అనేది స్థానిక స్వపరిపాలన



కింద రాష్ట్ర జాబితాకు సంబంధించిన అంశమని, పంచాయతీల సామర్థ్యాన్ని పెంపొందించడం ప్రధానంగా రాష్ట్రాల బాధ్యత అని కేంద్రం స్పష్టం చేసింది. అయినప్పటికీ, పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులు, సిబ్బందిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కేంద్ర ప్రాయోజిత పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.

**తెలంగాణకు సంబంధించి కేంద్రం తెలిపిన వివరాలు..**

13వ ఆర్థిక సంఘం (2010-11 నుండి 2014-15): కాలంలో తెలంగాణకు రూ. 652.88 కోట్లు కేటాయించగా, అధికంగా రూ. 895.16 కోట్లు నిధులు విడుదలయ్యాయన్నారు. 14వ ఆర్థిక సంఘం (2015-16 నుండి 2019-20)లో తెలంగాణకు రూ. 5,375.29 కోట్లకు గాను, రూ. 5,059.97 కోట్లు విడుదల చేశామని, అలాగే 2017-18 సంవత్సరానికి రూ. 119.28 కోట్లు చొప్పున పనితీరు గ్రాంట్లు విడుదలయ్యాయని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం (2020-21 నుండి 2025-26):?ప్రస్తుత కాలపరిమితిలో గ్రామీణ స్థానిక సంస్థల కోసం తెలంగాణకు రూ. 9,048.00 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ. 7,957.45 కోట్లు నిధులు విడుదలైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

### - సర్పంచ్ వై.శైలజ శ్రీనివాస్ రెడ్డి



ప్రజా కలం జూలై 28 (గద్వాల ప్రతినిధి) ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి వాతావరణ సమతుల్యత పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ వై. శైలజ శ్రీనివాసరెడ్డి అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామంలో మంగళవారం వాల్మీకి గ్రౌండ్లో సర్పంచ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారకంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వయంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా వాల్మీకి గ్రౌండ్ పరిసరాలను పచ్చదనంతో నింపేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని, కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని చెట్లుగా మార్చే వరకు సంరక్షించే బాధ్యతను గ్రామస్తులు, యువత తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ పరిధిలో ఖాళీ స్థలాలన్నింటిలోనూ మొక్కలు నాటి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చాపల కండ్ల కర్రెన్న, గ్రామపంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి, గ్రామ యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సరిహద్దు గ్రామాల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడులు

### – కుబీర్ మండలం నందపాడ్‌లో 41 నిషేధిత దేశీ దారూ సీసాల స్వాధీనం
### – అక్రమ మద్యం దందాపై ఉక్కుపాదం మోపనున్న ఎక్సైజ్ శాఖ

నిర్మల్, జూలై 28(ప్రజా కలం జిల్లా ప్రతినిధి):

సరిహద్దు గ్రామాల్లో నిషేధిత దేశీ దారూ అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపుతోంది. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (డీపీఓ) శ్రీనివాస్ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా టాస్క్‌ఫోర్స్



బృందం కుబీర్ మండలంలోని సరిహద్దు గ్రామాల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం నిల్వలను వెలికితీసింది. తనిఖీల్లో భాగంగా కుబీర్ మండలం నందపాడ్ గ్రామానికి చెందిన సాహెబ్‌రావు (తండ్రి: సంతోష్) నివాసంపై అధికారులు దాడులు చేపట్టారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ తాళం పగులగొట్టి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 41 నిషేధిత దేశీ దారూ సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జిల్లా డీపీఓ శ్రీనివాస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏఎస్ఐ ఎం. సింధు, సిబ్బంది దత్తాత్రి, శ్రీనివాస్, శారద పాల్గొన్నారు.సరిహద్దు ప్రాంతాల్లో నిషేధిత మద్యం నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా కొనసాగుతుందని, అక్రమ మద్యం వ్యాపారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ప్రజలు కూడా అక్రమ మద్యం విక్రయాలు లేదా నిల్వలపై సమాచారం ఉంటే ఎక్సైజ్ శాఖకు తెలియజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### జిల్లా కేంద్ర గ్రంథాలయానికి జేఈఈ-ఐఐటీ

# అధ్యయన పుస్తకాల విరాళం

ఖమ్మం జులై 28( ప్రజా కలం న్యూస్)

ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల ప్రయోజనార్థం కోసం జేఈఈ మెయిన్స్ , జేఈఈ అడ్వాన్స్ ఐఐటీ మరియు ఇతర ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన విలువైన అధ్యయన పుస్తకాలను శ్రీ తుమ్మా గణేష్ సాయి జిల్లా కేంద్ర గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు . ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా మాట్లాడుతూ ఐఐటీ ఢిల్లీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ( సి యస్ ఇ ) లో ప్రవేశం పొందిన శ్రీ తుమ్మా గణేష్ సాయి , ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ( కేఎంసి ) లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీ తుమ్మా ధరణి కుమార్ , కుమారుడు అని పేర్కొంటూ తన విజయానికి ఉపయోగపడిన అధ్యయన పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి విరాళంగా అందించడం అభినందనీయమని తెలిపారు . జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల సేకరణను నిరంతరం విస్తరిస్తున్నామని , జేఈఈ , ఐఐటీ , ఎన్ఐటీ , ఐఐఐటీ తదితర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని చైర్మన్ పేర్కొన్నారు . ఉన్నత విద్యలో విజయాలు సాధించిన విద్యార్థులు తమకు ఉపయోగపడిన పుస్తకాలను గ్రంథాలయాలకు విరాళంగా అందించి , భావితర విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని



ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ( కేఎంసి ) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీ తుమ్మా ధరణి కుమార్ స్వయంగా పాల్గొని తన కుమారుడు శ్రీ తుమ్మా గణేష్ సాయితో కలిసి అధ్యయన పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు అందజేశారు . ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా , శ్రీ తుమ్మా గణేష్ సాయిని అభినందించి ఆయన ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు . అలాగే శ్రీ తుమ్మా ధరణి కుమార్‌ను అభినందిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా విలువైన అధ్యయన పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి విరాళంగా అందించిన వారి కుటుంబ సేవాభావాన్ని కొనియాడారు . ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు , సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు .

## మహిళ కడుపులో కనతి ని తొలగించిన డాక్టర్ చెన్నయ్య

నాగర్ కర్నూల్ జూలై 28 (ప్రజా కలం)

అనిత కేర్ వెల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నాగర్ కర్నూల్ లో '(10 కేజీల ) ల 'ఒక పెద్ద కంతి ( పైబాయిడ్ యుటెరస్ గడ్డ) ని డా॥ మానిక్యాల చెన్నయ్య, సీనియర్ జనరల్ సర్జన్ డాక్టర్ మనీష మాచిక్యాల గైనకాలజిస్ట్, అనేస్టీయా డాక్టర్స్ డా.ప్రభు, డా॥ శ్రీకాంత్. ఓటి అసిస్టేంట్ రాము, శేకర్, రేనుక, అద్వర్యంలో 4 గంటలు శ్రమించి విజయవంతంగా ఆఫరేషన్ నిర్వహించి పెద్ద కణతి ని తొలగించడం జరిగింది. బిజినపల్లి మండలం మంగనూరు కు చెందినఅమతి చెన్నమ్మ భర్త రామ చంద్రయ్య. కడుపులోని కణతి గడ్డ వల్ల ఎన్నో రోజుల నుంచి భాదపడుతు, దాదాపు ఎదవరకు వ్యాప్తి చెంది ఎంతో ఇబ్బందిన్ని అనుభ విస్తు ఉండేది. మహబూబ్ నగర్ లోని ఎస్ వి ఎస్ హస్పిటల్, మరియు జిల్లా ప్రభుత్వా హాస్పిటల్ నిరాకరించి హైదాబాద్ రేఫర్ చేస్తే భయపడి నాగర్ కర్నూల్ అనిత కేర్ వెల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య హైరిస్క్ ను ఒప్పికొని



26. 7-26 నాడు అడ్మిట్ చేసుకోవడం జరిగింది. ఇటువంటి ఆఫరేషన్స్ పెద్ద, పెద్ద హాస్పిటల్స్ లో చేస్తు ఎన్నో లక్షలు రూపాయలు వసులు చెస్తా ఉంటారు లాంట్ (ప్రాంచాలు), చీరకడం ఉరిగింది. గర్భసంచిలో పుట్టే పైబ్బాయిడు యుటెరస్ ఇంత పెద్దగా, ఎద వరకు పెరగడం. సగం కడుపును వరకు ఆక్రమించడం అరుదుగా జరుగుతుంది ఈ గడ్డి వలన నిత్యం కడుపు నొప్పి, మూత్రసంభంధిత సమస్యలతో బాధ పడుతున్న బాధితురాలని స్థానిక పట్టణంలో గల వివాస డెమగ్నోస్టికు సెంటర్లు) సిటీ. స్కాన్ నిర్వహించి 25 లో గర్భసంచి కణితిగా నిర్ధారించడం జరిరింది లాఫిరేషన్కు 2 బాటిళ్ల రక్తాన్ని ఎమర్జెన్సిగా ప్రభుత్వ హస్పిటల్ బ్లడ్ బ్యాంక్ డా॥ రీహత్ దాన్ని అందజేయడం జరిగింది ప్రస్తుతం పేషెంట్ ఆరోగ్య పరిస్థితి నిలపడగా ఉందని డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య వివరించారు ఈ ఆపరేషన్లు డాక్టర్ మాణిక్యాల మనీషా డాక్టర్ ప్రభు డాక్టర్ శ్రీకాంత్ అసిస్టెంట్ రాము శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### భూగర్భ జలాల సంరక్షణకు విస్తృతంగా ఫామ్ పాండ్ లు నిర్మించుకోవాలి: కౌట్ల (కె) గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న కలెక్టర్ కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జూలై 28 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ గ్రామీణ మండలం కౌట్ల (కె) గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన లబ్ధిదారు మూడ నాగవ్వ కు చెందిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో



పాల్గొన్నారు. లబ్ధిదారురాలు, అధికారులతో కలిసి రిబ్బను కత్తిరించి గృహ ప్రవేశం చేశారు. అనంతరం ఇంటిని మొత్తాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు అందిన డబ్బుల వివరాలు వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇంటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. హౌట్ సర్వేను పరిశీలించారు. అంతకుముందు గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలించారు. ఇండ్లకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కల్పించిన వసతులను వాకబు చేశారు. విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజీ వంటి మౌళిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ, గ్రామస్తుల వినతి మేరకు కేటాయింపు పూర్తి అవగా మిగిలిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అర్హులకు అందిస్తామన్నారు. ఇళ్ల స్థలాలు లేని అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. సొంత స్థలాలు ఉన్న ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు. గ్రామంలో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ ను పరిశీలించారు. రైతులంతా ఫామ్ పాండ్ ల నిర్మాణాలకు ముందుకు రావాలని అన్నారు.ఈ కార్యక్రమాలలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఎంపీడీఓ సుధాకర్, సర్పంచ్ దుమాల రాజు, ఉప సర్పంచ్ రఘు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలి

### – రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ

నిర్మల్ జూలై 28 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వర్షపాతం తగ్గుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి పద్ధతులు అవలంబించేలా అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ కలెక్టర్లను ఆదేశించారు.

మంగళవారం సాయంత్రం సీఎస్ ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగు, విపత్తుల నిర్వహణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై సూచనలు అందించాలని తెలిపారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలని, రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటలను మార్చుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి విపత్తులు సంభవించినా వెంటనే స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విపత్తులు సంభవించినప్పుడు చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ టెలీ కాన్ఫరెన్స్ లో కలెక్టర్ భవేశ్ మిశ్రా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సీపీఓ గంగారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# నిత్యం వివాదాలకు కేరాఫ్ అడ్రస్ గా మాకుల క్షేత్రం

**– గుడిలో ఒక పూజారిపై మరొక పూజారి దాడి చేసుకోవడం సిగ్గుచేటు అంటూ**

**– మండి పడ్డ లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త జాదవ్ రమేష్ నాయక్**

మరిపెడ ప్రజా కలం న్యూస్ జూలై 28

మహబూబాద్ జిల్లా మరిపెడ మండల మున్సిపాలిటీ శివారు పైన మాకుల క్షేత్రంలో ఒక పూజారిపై మరొక పూజారి చేయి చేసుకోవడం సిగ్గుచేటు అని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు జాదవ్ రమేష్ నాయక్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుండీ లో డబ్బులు నిల్ పూజారి ప్లేట్లో డబ్బులు ఫుల్..హుండీలో డబ్బులు కాకుండా పళ్లెంలో డబ్బులు వేయించడం ఏంటి ప్రభుత్వ నిధులు కాకుండా భక్తుల దగ్గర తీసుకున్న నిధులు స్వాహా చేసిన అర్చక బృందం ఇప్పటికీ రెండు సంవత్సరాలు దాటిన కూడా విరాళాల లెక్కలు ప్రకటించని ఆలయ అధికారులు, త్వరిత గతిన ఆలయ భూమి దాతల పేర్లు, ఆలయ కట్టడం కు ప్రభుత్వ నిధులు కాకుండా భక్తుల దగ్గర తీసుకున్న నిధుల లెక్కలు ప్రకటించి శిల ఫలకాల మీద దాతల పేర్లు చెక్కించాలి అని లంబాడీల ఐక్య వేదిక ద్వారా డిమాండ్ చేస్తున్నాము అన్నారు ఆలయ అధికారి కి తెలియకుండా, ఎలాంటి రసీదులు ఇవ్వకుండా లక్షలు రూపాయలు వసూలు చేసిన అర్చకులను విధుల నుండి వెంటనే తొలగించాలి అని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త జాదవ్ రమేష్ నాయక్ డిమాండ్ చేసారు. ఒక **పూజారిపై మరొక పూజారి దాడి చేసుకోవడం ఏంటి**



**గాయత్రి ని గుంజి వేసి కుంకుమ మీద చల్లిన వైనం**

వీళ్లకు క్షేత్రం పై ప్రేమ లేదు కేవలం భక్తుల ద్వారా వచ్చే డబ్బుల మీద నే ప్రేమ, హుండీ లో డబ్బులు వేపించకుండా పళ్ళెం లో డబ్బులు వేయించుకొని స్వాహా చేస్తున్నారు అని వీరికి ప్రోత్సహిస్తున్న ముఠా ఆగడాలను అడ్డుకోవాలని ఆలయ అధివారులను డిమాండ్ చేశారు

**అర్చకుల తీరు పై భక్తుల అసహనం...**సుప్రసిద్ధ మాకుల భావసంగ్ మహారాజ్ మ్యారమా భవానీ ఆలయ క్షేత్రం అర్చకుల తీరుతో బ్రష్టు పడుతోంది అంటూ వాపోయారు తెలంగాణ రాష్ట్రంలోనే గిరిజన లంబాడీల కొంగు బంగారం గా నిలిచే మాకుల బావు సింగ్ బావా, మ్యారమా భవానీ ఆలయం దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లేక ఆలయ నిర్వహణ వారి ఇష్టారాజ్యంగా మారుతోంది అని ముఠా ఆగడాలకు అంతు లేకుండా పోతుంది. అన్నారు ఇప్పటికే ఆలయ సమీపంలో గౌరవ మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆలయం.చుట్టూ విడిచి పెట్టిన మూడు ఎకరాల భూమి లో కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేసినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి అన్నారు ఆలయంలో పని చేసి బదిలీ పై గుంజేడు ఆలయంలో ఈ ఓ గా పని చేసిన బిక్షమ చారి ఏసీబీ కి పట్టు బడ్డారు. ఎసిబి నిందితుడు ఆలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నట్లు ఇటీవల జరిగిన ఆలయ వేలం పాట లో గ్రామ పెద్దలు ఆరోపించారు అన్న విషయం అందరికీ తెలిసినదే అని మరొకసారి గుర్తు చేశారు ఇలా నిత్యం వివాదాల మధ్య ఆలయ నిర్వహణ గందర గోళం గా మారుతోందనీ భక్తులు ఆరోపిస్తు మాకుల క్షేత్రం భావసంగ్ బావ మ్యారామా భవాని పేరు చేర్పు ఉద్యమ నాయకులకు ఫోన్ లలో సంప్రదిస్తున్నారు అని తెలియ చేశారు ఇదిలా ఉండగా ఆలయ అర్చకుని బావ మరిది ఆదివారం మ్యారామా భవానీ ఆలయం లో విధులు నిర్వర్తిస్తుండగా ఆయన పై భౌతిక దాడి కి పాల్పడినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. ఆలయం లో జరుగుతున్న అవినీతి, వివాదాలు బయటకు పొక్కకుండా అర్చకులు జాగ్రత్తలు తీసుకుంటున్న ఓ మాఫియా ను అరికట్టాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని జాదవ్ రమేష్ నాయక్ ఆరోపించారు

# క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక విప్లవం 'హైపర్‌సైట్'తో సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం

**రేడియేషన్ థెరపీలో గేమ్ ఛేంజర్‌గా మారిన అడాప్టివ్ థెరపీ - 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ తప్పనిసరి**

**సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి వెల్లడి**




నాగర్ కర్నూల్, జూలై 28 (ప్రజా కలం)

క్యాన్సర్ మహమ్మారి అనగానే ఒకప్పుడు భయం... కానీ ఇప్పుడు అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో ఆ భయాన్ని పారద్రోలే రోజులు వచ్చాయి. క్యాన్సర్ చికిత్స అనగానే రోగులను తీవ్రంగా వేధించేది రేడియేషన్ వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ (దుష్ప్రభావాలు). కానీ, సరికొత్త సాంకేతికత 'హైపర్‌సైట్' మెషిన్ రాకతో క్యాన్సర్ చికిత్సలో నవశకం మొదలైందని, దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ దాదాపు లేకుండా సురక్షితంగా చికిత్స అందించవచ్చని యశోద హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ స్రవంతి స్పష్టం చేశారు. క్యాన్సర్ ముప్పు, కారణాలు, నూతన చికిత్సా విధానాలపై ఆమె పలు కీలక విషయాలను పంచుకున్నారు.

'హైపర్‌సైట్'తో అద్భుత ప్రయోజనాలు

క్యాన్సర్ కణాలను అంతం చేసే రేడియేషన్ థెరపీలో అడాప్టివ్ థెరపీ అనేది ఒక గొప్ప విప్లవమని డాక్టర్ స్రవంతి అభివర్ణించారు. అధునాతన 'హైపర్‌సైట్' మెషిన్ ద్వారా జరిగే ఈ చికిత్సలో అనేక సానుకూల అంశాలు ఉన్నాయని తెలిపారు:

సైడ్ ఎఫెక్ట్స్‌కు చెక్: ఈ నూతన విధానం ద్వారా చికిత్స చేయడం వల్ల రోగుల్లో 40% వరకు సైడ్ ఎఫెక్ట్స్ తగ్గుతాయి. అనవసరమైన కణజాలంపై రేడియేషన్ పడకుండా ఇది కాపాడుతుంది.

బ్రీతింగ్ కంట్రోల్: రోగి శ్వాసను నియంత్రిస్తూ కచ్చితత్వంతో చికిత్స చేయడం దీని ప్రత్యేకత. దీనివల్ల చుట్టుపక్కల ఉండే ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి నష్టం వాటిల్లదు.గంటల తరబడి యంత్రాల మీద ఉండాల్సిన అవసరం లేకుండా, ఈ ఆధునిక యంత్రం ద్వారా చికిత్స చాలా త్వరగా, సౌకర్యవంతంగా పూర్తవుతుంది.

స్త్రీ, పురుషుల్లో క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు ఇవే..

ప్రస్తుత రోజుల్లో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటానికి ప్రధానంగా మన జీవనశైలిలో వస్తున్న పెను మార్పులే కారణమని డాక్టర్ స్రవంతి విశ్లేషించారు.

పురుషుల్లో: మగవారిలో ఎక్కువగా ధూమపానం అలవాటు వల్లే శ్వాసనాళ, ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి. పొగతాగడం మానేయడం ద్వారా ఈ ముప్పును చాలా వరకు నివారించవచ్చు.

స్త్రీలలో: మహిళల్లో రొమ్ముక్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. అయితే ఇందులో సుమారు 10 శాతం కేసులు జన్యుపరమైన కారణాల వల్ల వస్తుండగా, మిగిలినవి జీవనశైలి, స్థూలకాయం తదితర కారణాల వల్ల వస్తున్నాయి.

# పాలమూరు రైతాంగ రక్షణ ధ్యేయం

**జూరాల నుండి సాగునీటి విడుదలపై మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటన**



గద్వాల ప్రతినిధి (ప్రజా కలం జులై 28) ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరద ప్రవాహంతో జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఈ నేపథ్యంలో స్థానిక ఆయకట్టు రైతుల పంట పొలాలను ఎండబెట్టకుండా, కాలువలు మరియు ఎత్తిపోతల పథకాలకు నిరంతరాయంగా సాగునీటిని విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఒక ప్రకటన విడుదల చేశారు. సాగునీటి అభ్యర్థనల దృష్ట్యా, తాను స్వయంగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డితో మాట్లాడి జూరాల ఆయకట్టు చివరి భూములకు కూడా సకాలంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. దీనిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, క్షేత్రస్థాయి అధికారులను అప్రమత్తం చేసి నీటి విడుదలకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.



# తల్లాడ వీడిసీ చైర్మన్ గా రెడ్డెం రామకృష్ణారెడ్డి

**సన్మానించిన మండలాధికారులు, పంచాయతీ పాలకవర్గం**

తల్లాడ జులై 28 (ప్రజా కలం న్యూస్ ):

తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా నారాయణపురం గ్రామానికి చెందిన రెడ్డెం రామకృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను తల్లాడ మండల అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం సన్మానించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి)తో పాటు ఎంపిడీవో శ్రీధర్ రాజు పలువురు అధికారులు, వార్డు మెంబర్లు శాలువాలతో సన్మానించి సత్కరించారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయితీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని,ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, ఈవో హరికృష్ణ, వార్డు సభ్యులు సరికొండ శ్రీనివాసరాజు, కమాల్, దోనెజ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఛలో హైదరాబాద్ జయప్రదం చేయండి

**సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్**

**ఎంఈఓ రాయల వీరస్వామి చేతుల మీదుగా గోడ పత్రిక ఆవిష్కరణ**



పాలేరు జూలై 28(ప్రజా కలం న్యూస్ )

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని డిమాండ్ తో ఆగస్టు 23 న టిఎస్ సిపిఎస్ ఈయూ చేపట్టనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఉద్యోగ,ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని సిపిఎస్ ఈయూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ పిలుపునిచ్చారు. మంగళవారం కూసుమంచి మండలం కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మూడు రోజుల ఉపాధ్యాయల శిక్షణ కార్యక్రమం భోజన విరామ సమయంలో వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగికి ఇచ్చే భిక్షం కాదని,తమ హక్కుగా ప్రభుత్వం గుర్తించాలని కోరారు.

అనంతరం మండల విద్యాధికారి రాయల వీరస్వామి చేతుల మీదుగా ఆగస్టు 23న చేపట్టిన ఛలో హైదరాబాద్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ బాధ్యులు బత్తుల ఉపేందర్, మందుల బిక్షం, ఆవునూరి శ్రీదేవి, పీఆర్టియు బాధ్యులు శీలం ఆంజనేయులు, యుటిఎఫ్ బాధ్యులు మండవ నరసయ్య, టిపిటిఎఫ్ ఉపేందర్ తో పాటుగా నవీన్, రాంబాబు, సాయికుమార్, ఇనపనూరి ముత్తయ్య, నరేష్, రామకృష్ణ, సురేష్, నవ్య, చైతన్య, సాయి లక్ష్మి, చిట్టి, శ్రీలక్ష్మి, రిజ్వాన, తదితర సిపిఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగి సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**- ఓపీ నిర్వహణకు ప్రామాణిక విధానాలు తప్పనిసరిగా అమలు చేయాలి**

**- ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఖాళీల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి**

**- ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం, జూలై 28( ప్రజా కలం న్యూస్)

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగి సంరక్షణ (పేషెంట్ కేర్)కు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆసుపత్రి నిర్వహణలో సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.

ఖమ్మం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సమావేశ మందిరంలో వైద్య అధికారులతో ఆసుపత్రి నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, వైద్య సేవల నాణ్యత, పేషెంట్ కేర్ అంశాలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ నిర్వహణకు అవసరమైన ప్రామాణిక విధానాలు (ఎస్ఓపీ) తప్పని సరిగా అమలు చేయాలని ఆదేశించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా మందులు, ఇతర వైద్య సామగ్రిని నిరంతరం అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఏ మందునూ ప్రైవేటుగా కొనుగోలు చేయాలని సూచించకూడదని స్పష్టం చేశారు.

ఆసుపత్రిలో రోగి సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రస్తుతం ఉన్న సమస్యలను మళ్లీ తలెత్తకుండా శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. పార్కింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల ఖాళీలపై ప్రత్యేక నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి లభించిన పోస్టులను ఔట్‌సోర్సింగ్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని, దరఖాస్తులు రాకపోతే వైద్యులు తమ వృత్తిపరమైన పరిచయాలు, స్నేహితుల వర్గం, నెట్‌వర్క్‌ను వినియోగించి అర్హులైన అభ్యర్థులను తీసుకువచ్చి పోస్టులు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన పోస్టులు భర్తీ కాకపోవడం మన వైఫల్యంగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు.

వైద్యులు కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా సమర్థవంతమైన పరిపాలకులుగా కూడా వ్యవహరించాలని, సమస్యలను గుర్తించడమే కాకుండా పరిష్కారాలను సృష్టించే దిశగా పనిచేయాలని సూచించారు. తన గత సేవాకాలంలో వైద్యులు తమ నెట్‌వర్క్ ద్వారా హనుమకొండ నుంచి ములుగు వరకు వైద్యులను తీసుకువచ్చి సేవలు అందించిన అనుభవాన్ని వివరించారు.

ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో మొత్తం ఎన్ని ఖాళీలు ఉన్నాయో, వాటిలో ఎన్ని పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసేందుకు అనుమతి లభించిందో, ఎన్ని పోస్టులకు అనుమతి లేదో, అనుమతి ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ కాలేదో పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇదే నివేదికలో పారామెడికల్ సిబ్బంది ఖాళీల వివరాలను కూడా చేర్చి, అన్ని ఖాళీల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సూచించారు.

ఆసుపత్రి భద్రతను మరింత బలోపేతం చేసేందుకు 8 లక్షలతో మంజూరు చేసిన భద్రతా పనులను వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది హాజరును బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయాలని, ఆస్పత్రిలో మంజూరైన నిధులతో పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని సూచించారు.

ఆసుపత్రిలోని ప్రతి వార్డు, ప్రతి గదిని పరిశీలించి పైకప్పుల లీకేజీలు సహా అవసరమైన మరమ్మతులను అంచనా వేసి, రోగి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ చేపట్టాల్సిన సివిల్ పనుల ప్రతిపాదనలు అంచనాలతో సహా ఆగస్టు 10వ తేదీలోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, ఇతర సామగ్రి కొనుగోళ్ల కోసం సరఫరాదారుల ఎంపానెల్‌మెంట్‌ను పారదర్శకంగా నిర్వహించాలని, అవసరమైన వస్తువులు, ధరలు, ఎంపానెల్‌మెంట్‌కు సంబంధించిన పూర్తి రికార్డులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ నిధులను అత్యంత బాధ్యతా యుతంగా, సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. ఆసుపత్రి భద్రతా సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, అవసరమైతే పోలీసు శాఖ సహకారం తీసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, ఐసీయూ, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల పర్యవేక్షకులు డా. డా. రాజేశ్వర రావు, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, ఆసుపత్రి వివిధ విభాగాల వైద్యాధికారులు, వైద్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగి వ్యక్తి మృతి.

దుబ్బాక ప్రజాకలం జూలై 28.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది.



రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కునంబి నంతోష్ (42) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై గ్రామంలోని కొంతమంది వద్ద అప్పులు చేశాడు. ఈ విషయమై భార్య అనిత సోమవారం మందలించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సంతోష్ సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ మానస తెలిపారు.

# ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

## ఎస్.ఐ.ఆర్ ప్రవాస్ అభియాన్ లో పాల్గొన్న అందెల శ్రీరాములు యాదవ్

మహేశ్వరం, జూలై 28,(ప్రజా కలం)

బిజెపి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మీర్ పేట్ క్లస్టర్-1 బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి గారూ ప్రధాన కార్యదర్శులు ధ్యాసనీ తిరుపతిరెడ్డి ఇంద్రావత్ రావినాయక్ ఆధ్వర్యంలో సర్ ప్రవాస్ అభియాన్ లో భాగంగా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్, డివిజన్ సంయోజక్ అందెల శ్రీరాములు స్థానిక బిజెపి నాయకులతో కలిసి గృహ సంపర్కం చేస్తూ ఓటర్లను కలుస్తూ ఎన్యుమరేషన్



ఫారాల పై అవగాహన కల్పించి పూర్తి వివరాలు జతపరచి సంబంధిత బిఎల్ఓ లకు తిరిగి అందజేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రతి బి ఎల్ ఏ -2లు వచ్చే వారం రోజులు తమ తమ బూత్ లలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలవాలని, అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారాల ప్రాముఖ్యతను వివరించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఫారాలు పూర్తి చేసేలా సహకరించాలని సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజలతో ఆత్మీయంగా మమేకమై వారి సందేహాలను నివృత్తి చేస్తూ, ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. అలాగే శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, డివిజన్ పదాధికారులు తమ తమ పరిధిలోని బూత్ కమిటీలతో సమన్వయం చేసుకొని, రోజువారీ కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని, పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ బి ఎల్ ఏ -1 అంబోజి శ్రీనివాస్ గారు, మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి. మాజీ అధ్యక్షులు పెండ్యాల నరసింహ గారు జిల్లా కార్యదర్శులు నీలా రవి నాయక్,విజయలక్ష్మి రాజు ముదిరాజ్,జిల్లా కార్యవర్గ సభ్యులు కీసర హరినాథ్ రెడ్డి.వరికుప్పల బుచ్చిరాములు. మాజీ కార్పొరేటర్లు ఏ భీమ్ రాజ్. ఎడ్ల మల్లేష్ ముదిరాజ్.మొక్క నందు గౌడ్, కిషోర్. జిల్లెల ప్రభాకర్ రెడ్డి, లతాశ్రీ వెంకట్ రెడ్డి. శీను నాయక్. విక్కీ సాగర్, మన్నెం రవీందర్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, దాసు శ్రీశైలం,జగన్నాథం, కోట్ల గోపాల్ రుద్ర వెంకటేష్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ పదాధికారులు, మాజీ కార్పొరేటర్లు, శక్తి కేంద్ర ఇన్చార్జులు, బి ఎల్ ఏ -2లు,పాల్గొన్నారు.

# గురుపూర్ణిమ విశిష్టత.. గురువులకు కృతజ్ఞతలు తెలిపే పవిత్ర పర్వదినం.

సిద్దిపేట ప్రజాకలం జూలై 28.

గురుపూర్ణిమ పండుగను భారతదేశం, నేపాల్, భూటాన్ దేశాల్లోని హిందువులు, బౌద్ధులు, జైనులు తమ ఆధ్యాత్మిక, విద్యా గురువులకు కృతజ్ఞతలు తెలుపుతూ జరుపుకునే పవిత్రమైన పండుగ. ఈ పూర్ణిమను వ్యాస పూర్ణిమ అని కూడా పిలుస్తారు. ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. భారతీయ సంస్కృతిలో గురువుకు దేవుడితో సమానమైన స్థానం ఉంది. అజ్ఞానాంధకారం నుండి జ్ఞాన వెలుగువైపు నడిపించే మార్గదర్శిగా గురువును భావిస్తారు. ఈ సందర్భంగా శిష్యులు గురువులను సత్కరించి, కానుకలు సమర్పించి, ఆశీర్వాదాలు తీసుకుంటారు. వ్యాస మహర్షి జన్మదినంగా భావించే ఈ రోజుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. అనేక మంది భక్తులు ఉపవాసం పాటిస్తారు.



గురువు విశిష్టత.

గురువు అంటే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించేవాడు. హిందూ సంప్రదాయంలో గురు-శిష్య సంబంధం జీవితాంతం కొనసాగే పవిత్ర బంధంగా భావిస్తారు. కొన్ని కుటుంబాల్లో ఇది తరతరాలుగా కొనసాగుతుంది.

చరిత్ర -- ప్రాముఖ్యత.

హిందూ మతంలో గురువును భగవంతునికి, భక్తునికి మధ్య సంధానకర్తగా భావిస్తారు. పూర్ణిమ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనేక మంది సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరిస్తారు. శిరిడీ సాయిబాబా ఆలయాల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం అధికారికంగా జరుపుకునే ఆరు ప్రధాన పండుగల్లో గురుపూర్ణిమ కూడా ఒకటి.

వ్యాస పూర్ణిమ.

హిందూ పురాణాల ప్రకారం మహాభారత రచయిత, వేదాలను ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదంగా నాలుగు భాగాలుగా విభజించిన మహర్షి వేదవ్యాసుడు ఈ రోజున జన్మించారు. అందుకే ఈ పౌర్ణమిని వ్యాస పూర్ణిమగా పిలుస్తారు.

ఆదిగురువు -- శివుడు.

యోగ సంప్రదాయం ప్రకారం మహాదేవుడు సప్తర్షులకు యోగ విజ్ఞానాన్ని బోధించడం ప్రారంభించిన రోజు కూడా ఇదేనని విశ్వసిస్తారు. అందువల్ల శివుడిని ఆదిగురువుగా ఆరాధిస్తారు.

గౌతమ బుద్ధుడు.

బౌద్ధుల విశ్వాసం ప్రకారం బుద్ధుడు జ్ఞానోదయం పొందిన అనంతరం సారనాథ్‌లో తన తొలి ఐదుగురు శిష్యులకు ధర్మచక్ర ప్రవర్తన బోధన చేసిన రోజు గురుపూర్ణిమ. ఈ సందర్భంగా బౌద్ధులు ఉపోసత ఆచరిస్తూ బుద్ధుని బోధనలను స్మరిస్తారు. వర్షాకాల ధ్యాన సాధన అయిన వస్స కూడా ఈ రోజుతో ప్రారంభమవుతుంది.

మహావీరుడు.

జైనుల నమ్మకం ప్రకారం 24వ తీర్థంకరుడైన మహావీరుడు తన తొలి శిష్యుడు గౌతమ స్వామిని స్వీకరించి గురువుగా అవతరించిన పవిత్ర దినం గురుపూర్ణిమ.

ఆచారాలు -- పూజా విధానం.

గురువుల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకోవడం.

శాలువాలు, పండ్లు, కానుకలతో గురువులను సత్కరించడం.

ఉపవాసం ఉండి గురు మంత్రాలను జపించడం.

ఆశ్రమాలు, గురుపీఠాలు, దేవాలయాల్లో భజనలు, సత్సంగాలు నిర్వహించడం.

వ్యాస మహర్షి రచించిన గురు గీత పారాయణం చేయడం.

ప్రసిద్ధ గురు క్షేత్రాలు.

మంత్రాలయం -- శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం.

రుషికేశ్, హరిద్వార్ -- గంగా తీర ఆశ్రమాలు.

శిరిడీ -- సాయిబాబా ఆలయం.

వారణాసి రాంనగర్ -- వ్యాస మహర్షి దేవాలయం.

బేలూర్ మఠం -- రామకృష్ణ మఠం.

సమ్మేద్ శిఖర్ (జార్ఖండ్) -- జైనుల పవిత్ర క్షేత్రం.

ఖాట్మండూ -- లింగ భైరవి ఆలయం.

వ్యాస మహర్షి.

వ్యాస మహర్షి మహాభారత రచయిత. వినాయకుడు మహాభారతానికి లేఖకుడిగా వ్యవహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. వేదాలను నాలుగు భాగాలుగా విభజించి, 18 పురాణాలు, 108 ఉపనిషత్తులను సంకలనం చేసిన మహనీయుడిగా వ్యాస మహర్షి ప్రసిద్ధి పొందారు.

గురువు లేకపోతే అంతా చీకటే.

వ్యక్తికి తొలి గురువు అమ్మ అయితే, గురువు రెండో తల్లి అని భారతీయ సంప్రదాయం చెబుతుంది. గురువు లేకపోతే జీవితం అజ్ఞానాంధకారంలోనే ఉంటుందని పెద్దలు పేర్కొంటారు.

గురు బ్రహ్మ గురు విష్ణుః
గురు దేవో మహేశ్వరః।
గురు సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః॥

నా గురువులకు, పాఠకులకు, శ్రేయోభిలాషులకు గురుపూర్ణిమ శుభాకాంక్షలు.

ఇట్లు:

**మన్నె గణేష్. 9701820298 ప్రజాకలం ప్రతినిధి, సిద్దిపేట.**

# అర్హులైన ఓటర్లందరూ వెంటనే దరఖాస్తులు చేసుకోవాలి

## మహేశ్వరం ఎమ్మార్వో చిన్నప్పల నాయుడు

మహేశ్వరం, జులై 28: (ప్రజా కలం )

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం గడువు ఆగస్టు 3తో ముగియనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరు ఆలస్యం చేయకుండా దరఖాస్తు ఫారాలు సమర్పించాలని మహేశ్వరం తహసీల్దార్ (ఎమ్మార్వో) చిన్నప్పలనాయుడు సూచించారు. గడువు సమీపిస్తున్న వేళ గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించి, ఇంకా దరఖాస్తులు సమర్పించని ఓటర్లతో ఫారాలు వెంటనే పూర్తి చేయించాలని సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.మహేశ్వరం మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై ఎమ్మార్వో సమీక్ష నిర్వహించారు. గడువు ముగిసేందుకు కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ఇప్పటికీ దరఖాస్తులు సమర్పించని అర్హులైన ఓటర్లను గుర్తించి, వారితో వెంటనే ఫారాలు నింపించి సంబంధిత బీఎల్‌వోలకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గడువు చివరి రోజు వరకు వేచి ఉండకుండా సమీప బీఎల్‌ఓల వద్ద నుంచి దరఖాస్తు ఫారాలు తీసుకుని, అవసరమైన వివరాలు పూర్తి చేసి వెంటనే సమర్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.గ్రామాల్లో ప్రతి ఇంటికీ



ఎస్ఐఆర్ ప్రక్రియపై సమాచారం చేరేలా సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలిపారు.అర్హులైన ఒక్క ఓటరు కూడా ఈ ప్రక్రియకు దూరం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు నమోదైన ఎస్ఐఆర్ పురోగతిని కూడా ఎమ్మార్వో వెల్లడించారు.సరూర్‌నగర్‌లో 42.16 శాతం, సరూర్‌నగర్ సర్కిల్-12లో 37.44 శాతం, బడంగ్‌పేట్ సర్కిల్-16లో 44.26 శాతం, బాలాపూర్‌లో 55.69 శాతం, జల్‌పల్లి సర్కిల్-17లో 58.18 శాతం, మహేశ్వరంలో 75.92 శాతం, కందుకూరులో 86.61 శాతం నమోదు అయినట్లు తెలిపారు.తక్కువ నమోదున్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. సమావేశంలో ఆర్ఐలు రాజిరెడ్డి, విశ్వనాథ్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజా కలం PRAJA KALAM Telugu Daily

ప్రకటనలకు ఆహ్వానం

క్లాసిఫైడ్స్
లీగల్ నోటీసులు
ప్రారంభోత్సవం
స్వదేశాగమనం
షష్టిపూర్తి మహోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
షష్టిపూర్తి మహోత్సవం
వివాహ మహోత్సవం
శ్రద్ధాంజలి
పదవీ విరమణ

అన్ని రకముల ప్రకటనలకు సంప్రదించండి

94403 52123, 9010972526
79939 41570, 80083 72900
95535 39999, 98490 07793



విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ,
పాఠకుల విశేష ప్రజాదరణ పొందుతూ
విజయవంతంగా రెండు తెలుగు రాష్ట్రాలలో నడపబడుతున్న
'ప్రజాకలం' తెలుగు దినపత్రికకు
జర్నలిజంపై ఆసక్తి, తెలుగు భాష పట్ల అవగాహన కలిగి
వ్రాయడం, చదవడంతో పాటు ప్రస్తుత సమాజం పట్ల బాధ్యత
కలిగిన విలేకరులు అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు మండలాల వారిగా కావలెను.

ప్రజా కలం PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

తెలంగాణలో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను

సంప్రదించాల్సిన నంబరు:
+91 95535 39999

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను


# సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన నిందితుడు వన్నూరు స్వామి అరెస్టు

## - సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాలను గుడ్డిగా నమ్మొద్దు

## -వన్నూరు స్వామి పై పలు కమిషనరేట్ల పరిధిలో కేసులు- ఆర్జీఐఏ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్

శంషాబాద్, జూలై 28, (ప్రజా కలం )

సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాలను గుడ్డిగా నమ్మొద్దని శంషాబాద్ ఆర్జీఐఏ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ క్యాటరింగ్ వ్యాపారం చేసే వన్నూరు స్వామి కస్టమర్లు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వలేదని కోపంతో కస్టమర్లను అసభ్యకరమైన మాటలతో తిడుతూ చిత్రహింసలకు గురి చేస్తున్న వన్నూరు స్వామి అనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చెన్నూరు స్వామి మహిళల ఫోటోలు వారి ఫోన్ నెంబర్లను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి కాల్ గర్ల్ అంటూ అసత్య ప్రచారం చేశాడు. దీంతో బాధిత మహిళలు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో నిందితుడు డబ్బు లావాదేవీల విషయంలో విభేదాల కారణంగా ఇలా బెదిరింపులకు, వేధింపులకు పాల్పడినట్లు తేలింది. నిందితుడిపై సైబరాబాద్, హైదరాబాద్, మల్కాజ్‌గిరి , ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో కేసులు ఉన్నట్లు ఏసిపి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. నిందితుని ఫోన్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అసభ్య పోస్టులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఐటీ చట్టం, మహిళల వేధింపులకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు



నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

మహిళలు ఇలాంటి నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఇలాంటి వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే 100 లేదా సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు.

## నార్సింగి మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన

### -బి ఆర్ ఎస్ నార్సింగి సర్కిల్ అధ్యక్షుడు కె విష్ణువర్ధన్ రెడ్డి

### -సర్ ఓటర్ల నమోదు ప్రక్రియపై చర్చ

రాజేంద్రనగర్,జూలై 28,(ప్రజా కలం)

రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి మున్సిపల్ పరిధిలో సాగుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్ ) ఓటర్ల నమోదు ప్రక్రియపై బి ఆర్ ఎస్ నార్సింగి సర్కిల్ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ప్రతినిధి బృందం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఎల్ఓలు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి విధుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు దాదాపు 50 శాతం మేరకే పనులు పూర్తయ్యాయని,



ఇంకా అనేకమంది అర్హులైన పౌరుల ఓట్లు నమోదు కాకపోవడంపై విష్ణువర్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.?ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు పలు కీలక అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉర్దూలో సమాచారం: ఎస్ఐఆర్ (సర్ ) ప్రక్రియకు సంబంధించిన వివరాలు, సమాచారం కేవలం తెలుగులోనే ఉండటం వల్ల మైనారిటీలకు అవగాహన లోపిస్తోందని తెలిపారు. తెలుగు సరిగా రాని మైనారిటీల సౌకర్యార్థం సమాచారాన్ని ఉర్దూలోకి అనువదించి (ట్రాన్స్‌లేషన్) వివరాలు తెలియజేయాలని అధికారులను కోరారు. ?అద్దెదారుల (కిరాయిదారుల) ఓట్లు: మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న వారిలో ఎక్కువ భాగం అద్దెదారులే ఉన్నారని అధికారులు తెలపడంతో, వారి ఓట్ల నమోదును ఏ విధంగా పరిగణనలోకి తీసుకుంటారనే అంశంపై కమిషనర్‌తో చర్చించారు.

తప్పుడు ఓట్ల నివారణ: ఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ముందుజాగ్రత్త చర్యగా ఎక్కడా తప్పుడు ఓట్లు నమోదు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ ముక్తార్, ముఖ్య నాయకులు పెద్దపులి కిషన్, గణేష్ ముదిరాజ్, నరసింహ, మల్లేష్, గణేష్ రెడ్డి, చిరంజీవి, మహిపాల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ కళాకారులకు ఐడి కార్డులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో అవకాశాలు కల్పించాలి: ఎర్రవల్లి శ్రీనివాస్

సిద్దిపేట:28 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లాలోని నిరుద్యోగ జానపద కళాకారులను గుర్తించి భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ఐడి కార్డులు జారీ చేయడంతో పాటు, దేవస్థానాలు మరియు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకు అవకాశాలు కల్పించాలని ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం



డిమాండ్ చేసింది.రాష్ట్ర కమిటీ చైర్మన్ అన్వోజు వెంకటేశం,రాష్ట్ర అధ్యక్షుడు దరువు అంజన్న పిలుపు మేరకు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాకారులు జిల్లా డిపిఆర్వోను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎర్రవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ,జిల్లాలోని నిరుద్యోగ జానపద కళాకారులను గుర్తించి భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ఐడి కార్డులు అందజేయాలని,ఆగస్టు 22న నిర్వహించనున్న జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా జిల్లా దేవస్థానాలు,ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి దాసు,రాష్ట్ర కమిటీ సభ్యులు పుల్లూరు శ్రీనివాస్, పిల్లిట్ల బుజంగం,జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్,ఉపాధ్యక్షులు తునికి రాజు,పాకాల భూపతి,ప్రధాన కార్యదర్శి చిన్నగుండవెల్లి పరమేష్, ప్రచార కార్యదర్శి రాజు చిన్నగుండవెల్లి, సంయుక్త కార్యదర్శులు ధనరేఖ,బొల్లం రాజేష్,కోశాధికారి రాజు కందకట్ల, సలహాదారులు పిల్లిట్ల శశిధర్,ఇనుప సురేష్, కమిటీ సభ్యులు ఐరేని రేణుక, బోడ భాగ్య,సూర్యావంశీ విధుమౌళి, బిక్షపతి తదితర నిరుద్యోగ కళాకారులు పాల్గొన్నారు.



## రైతులకు అవగాహన కల్పించిన ఏడీఏ బాబు నాయక్.

దుబ్బాక ప్రజాకలం జూలై 28.

ఎల్ నినో పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని గజ్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు బాబు నాయక్ సూచించారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్ నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తక్కువ నీటి అవసరం ఉండే పంటలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని రైతులకు సూచించారు. వర్షపాతం అనిశ్చితంగా ఉండే నేపథ్యంలో నీటి వినియోగాన్ని పొదుపుగా చేస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని వివరించారు. అలాగే సాంకేతిక వ్యవసాయ పద్ధతులు, పంటల ఎంపిక, సాగు విధానాలు, నీటి యాజమాన్యం, అధిక దిగుబడులు సాధించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులు అడిగిన సందేహాలకు వ్యవసాయ అధికారులు సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్.నరేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు రజిత, శిరీష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టిగా కృషి చేద్దాం

### - బ్లాక్ స్పాట్లలో తక్షణ చర్యలు చేపట్టాలి
### - అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
### - రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాలు.

సంగారెడ్డి, ప్రతినిధి జూలై 28 ( ప్రజా కలం ): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను శాస్త్రీయంగా విశ్లేషించి, బ్లాక్ స్పాట్లలో తక్షణ నివారణ చర్యలు చేపట్టడం ద్వారా జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, వాటికి దారితీస్తున్న కారణాలపై అధికారులతో వివరంగా చర్చించారు. ప్రమాదాల నివారణకు ప్రతి శాఖ చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడ ప్రమాదం జరిగినా దాని వెనుక ఉన్న కారణాలను పూర్తిస్థాయిలో విశ్లేషించి, భవిష్యత్తులో అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు



తీసుకోవాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడం, గుంతలు, ఎత్తుపల్లాలను వెంటనే మరమ్మతు చేయడం, అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయడం, ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే హాట్ స్పాట్లు, రోడ్డు క్రాసింగ్‌ల వద్ద రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైనేజీలు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు జిల్లాలోని ట్రామా కేర్ సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్యులు, అత్యవసర పరికరాలు, అంబులెన్స్ సేవల వివరాలను సమీక్షిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత కాదని, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి అమూల్యమైన మానవ ప్రాణాలను కాపాడే దిశగా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, డీఎస్పీలు, రవాణా శాఖ అధికారులు, ఆర్టీసీ ప్రతినిధులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీపీ రష్మి పెరుమాళ్ ఆకస్మిక తనిఖీ

### రికార్డులు, దర్యాప్తు కేసుల సమీక్ష.
### సీసీటీవీలు, బీట్ పోలీసింగ్, రోడ్డు భద్రతపై కీలక ఆదేశాలు




గజ్వేల్:28 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్,ఐపీఎస్ మంగళవారం గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు సిబ్బంది గార్డ్ ఆఫ్ ఆనర్ సమర్పించారు.అనంతరం స్టేషన్ ఆవరణ, కాంపౌండ్ వాల్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేలా రూపొందించిన చిత్రాలను పరిశీలించి అభినందించారు.అలాగే వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను తనిఖీ చేశారు.పోలీస్ సిబ్బంది శారీరక దారఢ్యం, మానసిక ఉల్లాసం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును సీపీ ప్రారంభించారు.అనంతరం సిబ్బందికి కేటాయించిన కిట్ ఆర్టికల్స్,యూనిఫాం ప్రమాణాలను పరిశీలించారు.స్టేషన్‌లోని రికార్డులు,పెండింగ్ దర్యాప్తు కేసులు,తీవ్రమైన నేరాల వివరాలను సమగ్రంగా సమీక్షించిన సీపీ,దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విలేజ్ పోలీస్ అధికారులు తమ పరిధిలోని గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు.పగలు, రాత్రి బీట్ విధుల్లో అనుమానితుల వేలిముద్రలను ఫింగర్‌ప్రింట్ డివైజ్ ద్వారా తనిఖీ చేసి పాత నేరస్తులను గుర్తించాలని ఆదేశించారు.'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో సీసీటీవీల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించి వాటి ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు.అలాగే 'సిద్దిపేట పోలీస్ ఉద్యోగమిత్ర' ఆన్‌లైన్ పోర్టల్ గురించి యువతకు విస్తృతంగా తెలియజేసి సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని,ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం సిబ్బందితో సమావేశమైన సీపీ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రతి పోలీసు అధికారి అన్ని రకాల విధులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వ్యక్తిగత లేదా విధి సంబంధిత సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.కార్యక్రమం ముగింపులో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ మొక్కను నాటారు.ఈ తనిఖీల్లో గజ్వేల్ ఏసీపీ నర్సింలు,టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణతో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తో పాటు ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.





## ప్రతి విద్యార్థి ట్రాఫిక్ సేఫ్టీ అంబాసిడర్ గా మారాలి.

### - ఏసిపి శంకర్ రాజు

మెదక్ జులై 27 ప్రజా కలం ప్రతినిధి లావణ్య

అల్లాదుర్గం రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రమాదాలు నివారణకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మల్కాజిగిరి కమిషనరేట్ ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. శంకర్ రాజు అన్నారు. మంగళవారం అల్లాదుర్గ్ మండల పరిధిలోని, ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. విద్యార్థులు ఫుట్‌పాత్‌లపై నడవడం, జీబ్రా క్రాసింగ్‌ల ద్వారా మాత్రమే రోడ్లు దాటడం, ట్రాఫిక్ సంకేతాలను పాటించడం, రోడ్లపై అప్రమత్తంగా ఉండడం, చట్టబద్ధమైన వయస్సు రాకముందు వాహనాలు నడపకూడదని సూచించారు.

తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించేలా, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్ట్ వినియోగించేలా, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకుండా, మద్యం సేవించి వాహనాలు నడపకుండా అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు.

ప్రతి విద్యార్థి ట్రాఫిక్ సేఫ్టీ అంబాసిడర్" గా మారి కుటుంబ సభ్యులు, స్నేహితులు కు మరియు సమాజంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రమేష్, ఉపాధ్యాయులు ఆంజనేయులు, దీన, శ్రీకాంత్, సంతోష్ ,రాజరత్నం, తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శాఖల పంచాయతీ.. ప్రజలకు శాపం..

### -తెల్లాపూర్‌లో తాగునీటి కష్టాలు..
### శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రజల అవస్థలు..

పటాన్‌చేరు, జులై 28 (ప్రజా కలం) ప్రతినిధి

తెల్లాపూర్ జి.హెచ్.ఎం.సి పరిధిలో తాగునీటి సమస్యలు తీవ్రంగా మారాయి.కొల్లూరు, ఎదుల నాగులపల్లి,మర్రి 2బీహెచ్‌కే కాలనీతో పాటు పలు



కాలనీల ప్రజలు కలుషిత నీరు, అస్తవ్యస్తమైన నీటి సరఫరాతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దెబ్బతిన్న పైప్‌లైన్ల కారణంగా నాణ్యత లేని నీరు సరఫరా అవుతుండటంతో ప్రజల ఆరోగ్యంపై ఆందోళన నెలకొంది.ఈ సమస్యపై బీఆర్ఎస్ యువ నాయకులు, తెల్లాపూర్ డివిజన్ నాయకులు బాలగౌని సాయిచరణ్ గౌడ్ స్పందిస్తూ..జలమండలి అధికారులు తమకు ఇంకా అప్పగింత జరగలేదని చెబుతుండగా, జి.హెచ్.ఎం.సి అధికారులు నిధుల కొరత ఉందంటూ బాధ్యత తప్పించుకుంటున్నారని ఆరోపించారు.శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రజలే నష్టపోతున్నారని మండిపడ్డారు.ప్రజల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడకుండా వెంటనే దెబ్బతిన్న పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి, సక్రమమైన స్వచ్ఛమైన తాగునీటి సరఫరా అందించాలని బాలగౌని సాయిచరణ్ గౌడ్ డిమాండ్ చేశారు.ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని కోరారు..

## రాష్ట్ర ప్రజల సుఖ సంతోషాల కోసం దువా (ప్రార్థనలు)

### ఇస్తేమా మహాసభలో పాల్గొన్న మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్

మహేశ్వరం జూలై 28,(ప్రజా కలం )

మహేశ్వరం నియోజకవర్గంలోని జలపల్లి సర్కిల్, షాహీన్ నగర్ మర్కజ్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన ఇస్తేమా మహాసభలో మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలను ఆప్యాయంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేసి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, ప్రజల సుఖసంతోషాల కోసం దువా (ప్రార్థనలు) చేశారు.ఈ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన ముస్లిం సోదరులు, మత పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## హైదర్ నగర్ మైసమ్మ ఆలయం లో ఆషాడ మాసం బోనాలు

కూకట్ పల్లి, జులై 28, ప్రజా కలం ప్రతినిధి:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయినా ఆషాడ మాసం బోనాలు. ఆషాడ మాసం సందర్భంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానమేట్ గ్రామానికి చెందిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గణేష్ యాదవ్ మంగళవారం హైదర్‌నగర్‌లోని మైసమ్మ అమ్మవారి దేవాలయంలో బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్, గంగల నరసింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్, గంగల జంగయ్య యాదవ్, గంగల మల్లేష్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు గంగల రాధాకృష్ణ యాదవ్, ఉప్పల ఏకాంత్ గౌడ్, నారగోని కృష్ణ గౌడ్ తో పాటు పలువురు సోదరులు, బంధుమిత్రులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంజీవరెడ్డి ని సన్మానించిన అనిల్ గుప్తా.

సంగారెడ్డి ప్రతినిధి జులై 28 (ప్రజా కలం ): తెలంగాణ రాష్ట్ర శాసనసభా హామీల అమలు కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే డా.పట్లోళ్ల సంజీవరెడ్డి కి యం ఎల్ ఏ క్వాటర్స్ లో మంగళవారం నాడు మర్యాదపురకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన మాసన్ పల్లి యువ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సి అనిల్ గుప్తా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరాలనుండి నారాయణఖేడ్ నిజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటున్న మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు కిష్టారెడ్డి కుమారులు ప్రస్తుత ఎమ్మెల్యే సంజీవరెడ్డి వారి బ్రదర్స్ శేఖర్ రెడ్డి సుధాకర్ రెడ్డి ప్రజల కొరకే అందుబాటులో ఉంటూ ప్రజా చేయవా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కొరకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర శాసనసభ హామీల అమలు కమిటీ ఛైర్మన్గా బాధ్యతలు చెప్పినందుకు ముఖ్యమంత్రికి కూడ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.






## గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ సాధారణ సమావేశం

### అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నిర్ణయం

### - తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ పనులపై సమీక్ష..

### - ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

గజ్వేల్:28 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ పురపాలక సంఘం సాధారణ సమావేశం మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ అధ్యక్షతన, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కార్ పద్మబాయి




నర్సింగరావు సమక్షంలో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,తాగునీటి సరఫరా,రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ పనితీరుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడంతో పాటు, వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు పాలకవర్గం,అధికారులు సమన్వయంతో పనిచేయాలని,గజ్వేల్--ప్రజ్ఞాపూర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# ఉపాధ్యాయులు వృత్తి ధర్మం పాటించాలి

### - నిర్లక్ష్యంపై కలెక్టర్ హైమావతి ఆగ్రహం

### - జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆకస్మిక తనిఖీ..

### - సమగ్ర విచారణకు ఆదేశాలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి: 28జూలై ( ప్రజా కలం ప్రతినిధి )

ఉపాధ్యాయులు వృత్తి ధర్మాన్ని పాటిస్తూ విద్యార్థుల అభివృద్ధికి నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆమె, ఉపాధ్యాయుల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, సంతకాలు చేయకుండా మధ్యాహ్న సమయంలో పలువురు ఉపాధ్యాయులు పాఠశాల నుంచి వెళ్లడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇది రోజూ జరుగుతోందా అని ప్రిన్సిపల్‌ను ప్రశ్నించారు. అనంతరం టీచర్ డైరీలను తనిఖీ చేయగా, కొందరు ఉపాధ్యాయులు డైరీలు నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, పాఠాలు సక్రమంగా బోధిస్తున్నారా అనే అంశంపై ఆరా తీశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది క్రమశిక్షణ లేకుండా వ్యవహరించడం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్‌కు ఫోన్ చేసి, పాఠశాల పనితీరు, ఉపాధ్యాయుల విధుల నిర్వహణ,విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు.డీఈఓ సూచన మేరకు పాఠశాలకు చేరుకున్న సెక్టోరియల్ అధికారి రామస్వామికి, మరో ఇద్దరు అధికారులతో కలిసి ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి బోధనా విధానం, ఉపాధ్యాయుల పనితీరు,టీచర్ డైరీలు,లెస్సన్ ప్లాన్లపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి



సాయంత్రంలోగా నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు వృత్తి విలువలు,వృత్తి ధర్మాన్ని కాపాడాలని అన్నారు.విధుల్లో నిర్లక్ష్యం అంటే విద్యార్థుల విద్య, భద్రత,పాఠశాల నిర్వహణ, అధికారిక బాధ్యతలను విస్మరించడమేనని స్పష్టం చేశారు.సమయపాలన పాటిస్తూ క్రమం తప్పకుండా నాణ్యమైన బోధన అందించాలని, విద్యార్థుల్లో జ్ఞానం,నైపుణ్యాలు, నైతిక విలువలను పెంపొందించాలని సూచించారు. విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ వారి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడాలని, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యంతో సమన్వయంగా పనిచేస్తూ ఆధునిక బోధనా పద్ధతులను నేర్చుకుని వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ హైమావతి సూచించారు.

# గజ్వేల్ అభివృద్ధి కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధం

### గజ్వేల్ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కవితకు బహుమతిగా అందిద్దాం

### : కొట్టాల యాదగిరి ముదిరాజ్

### - గజ్వేల్ అభివృద్ధి కోసం నిరంతరం పోరాడతాం..

### - తెలంగాణ రక్షణ సేనలో ఉద్యమకారులకు పెద్దపీట




గజ్వేల్ :28 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రక్షణ సేనలో ఉద్యమకారులకు పెద్దపీట వేస్తుండగా,వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుండి టిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి అధ్యక్షురాలు కవితకు బహుమతిగా ఇద్దామని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు,గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు.గజ్వేల్ నియోజకవర్గ పార్టీ ఇన్చార్జిగా నియమితులైన సందర్భంగా ఆయన మంగళవారం గజ్వేల్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.సామాజిక తెలంగాణ లక్ష్యంగా ఏర్పడిన టిఆర్ఎస్ పార్టీ మహిళలు,యువత,ఎస్సీ,బీసీ, మైనారిటీ తదితర వర్గాలకు పెద్దపీట వేస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.గజ్వేల్ లోని ఉద్యమకారులు ఆత్మ విమర్శ చేసుకోవాలని,ఏ ఒక్కరికి కూడా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యమ నేత కవితతో కలిసి రావాలని, తద్వారా మనను నమ్ముకున్న పేద,బడుగు,బలహీన వర్గాలకు సంపూర్ణ న్యాయం చేయగలుగుతామని అన్నారు.ముఖ్యంగా దేశంలోనే గజ్వేల్ నియోజకవర్గం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉండగా,కెసిఆర్ పై ఉన్న వ్యక్తిగత కక్షతో సీఎం రేవంత్ రెడ్డి గజ్వేల్ అభివృద్ధిపై నిర్లక్ష్యం చేస్తున్నట్లు విమర్శించారు.అయితే గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరిట పేదల ఇండ్లను కూల్చివేయగా,వారికి ఇప్పటి వరకు న్యాయం జరగలేదని,ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.కమిషన్ల కోసం కట్టిన భవనాలు నిరుపయోగంగా ఉండగా,రూ కోట్లు వెచ్చించి నిర్మించిన రింగ్ రోడ్డు అందుబాటులోకి తేవడంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఎద్దేవా చేశారు.

పెరిగిన గజ్వేల్ జనాభాను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి చేయాల్సిన యంత్రాంగం పట్టించు కోవడం లేదని గుర్తు చేశారు.సామాజిక తెలంగాణ ఏర్పాటు టిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత లక్ష్యం కాగా, గజ్వేల్ అభివృద్ధి కోసం,సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తూ ప్రాణాలు అర్పించడానికి సిద్ధమని ఆయన ప్రకటించారు.ఇందిరా పార్క్ చౌరస్తా నుండి కోట మైసమ్మ ఆలయం వరకు చేపట్టాల్సిన అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని, ఇందుకోసం స్థానిక కాంగ్రెస్ నేతలు చరవ చూపాలని డిమాండ్ చేశారు.అలాగే గజ్వేల్ అభివృద్ధిని కొన్ని వర్గాలు అడ్డుకుంటుండగా,పద్ధతి మార్చుకోని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, నాయకులు నవీన్,కుమార్ అశోక్,రాజు,చందు, సురేష్, రమేష్,ప్రసాద్, నర్సింలు,నరేష్,శ్రావణ్, నాగరాజు, హరి,మిస్బా,రతిక్,అబ్బు పాల్గొన్నారు.

## బీరంగూడకు అభివృద్ధే అజెండా

### -బీరంగూడ అభివృద్ధి పనులకు జోనల్ కమిషనర్‌కు కాంగ్రెస్ వినతి..

పటాన్‌చెరు, జులై 28 (ప్రజా కలం) ప్రతినిధి

బీరంగూడ డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్




నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు వందనపురి కాలనీ,ఎస్ఎన్ఐ కాలనీ మారుతి నగర్ ప్రాంతాల్లో సిమెంట్ రహదారులు మురుగునీటి కాలువల నిర్మాణ పనులను అత్యవసరంగా చేపట్టాలని ఆయన కోరారు. సరైన రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలంలో సమస్యలు మరింత పెరుగుతున్నాయని వివరించారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు వెంటనే అనుమతులు మంజూరు చేసి ప్రారంభించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్థానికులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి కొనసాగిస్తామని శశిధర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు..

## ఘణపూర్‌లో ఎల్లమ్మ కల్యాణ వైభవం

### -ఎల్లమ్మ కల్యాణోత్సవంలో కాట శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజలు..

పటాన్‌చెరు, జులై 28 (ప్రజా కలం) ప్రతినిధి

ముత్తంగి డివిజన్ పరిధిలోని ఘణపూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది.ఈ వేడుకలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్



పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి కరుణాకటాక్షాలతో ఘణపూర్ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. మన సంప్రదాయాలు, ఆచారాలు సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని గ్రామస్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించగా,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు..

## వాయుసేనలో చేరండి..

### యువతకు ఐఏఎఫ్ గోల్డెన్..

### -భారత వాయుసేనలో చేరి దేశసేవ చేయండి: దీపక్ భరద్వాజ్..

పటాన్‌చెరు,జులై 28 (ప్రజా కలం) ప్రతినిధి

యువత భారత వాయుసేనలో అధికారులుగా,అగ్నివీరులుగా చేరి దేశసేవలో భాగస్వాములు కావాలని భారత వైమానిక దళానికి చెందిన మాస్టర్ వారెంట్ ఆఫీసర్ దీపక్ భరద్వాజ్ పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో నిర్వహించిన భారత వైమానిక దళ నియామకం,వృత్తి మార్గదర్శనం కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు వాయుసేనలోని ఉద్యోగ అవకాశాలు,అర్హతలు, ఎంపిక విధానంపై అవగాహన కల్పించారు.కేంద్ర ప్రజాసేవా సంఘం పరీక్ష,వైమానిక దళ ప్రవేశ పరీక్ష, జాతీయ కేడెట్ దళ ప్రత్యేక ప్రవేశం ద్వారా శాశ్వత లేదా స్వల్పకాలిక సేవా కమిషన్‌లో చేరవచ్చని తెలిపారు.రాత పరీక్షలు, వ్యక్తిత్వ మదింపు,మానసిక పరీక్షలు,ఇంటర్వ్యూ,వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక జరుగుతుందని వివరించారు.వాయుసేనలో ఆకర్షణీయమైన జీతభత్యాలు,నివాసం,వైద్య సేవలు,విద్యా అవకాశాలు, బీమా,వృత్తి పురోగతి వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.కార్యక్రమంలో భారత వాయుసేన సామర్థ్యాలను ప్రతిబింబించే మొబైల్ ప్రదర్శన, అనుకరణ సదుపాయం ఏర్పాటు చేశారు.ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణు కుమార్ నాతి అతిథులను సత్కరించగా, కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ మహమ్మద్ అక్తర్ ఖాన్ వృత్తి మార్గదర్శక కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొని వాయుసేన అధికారులతో సందేహాలను నివృత్తి చేసుకున్నారు..



## తిమ్మపూర్‌లో శరవేగంగా వీవో భవన నిర్మాణ పనులు

### నాణ్యతను పరిశీలించిన సర్పంచ్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 28:
తిమ్మపూర్ గ్రామంలో మహిళా సాధికారతే లక్ష్యంగా రెండు నెలల క్రితం ప్రారంభించిన స్వయం సహాయక సంఘాల (వీవో) భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం నిర్మాణ స్థలాన్ని సర్పంచ్ స్వయంగా



సందర్శించి పనుల పురోగతిని పర్యవేక్షించారు. నిర్మాణంలో వాడుతున్న మెటీరియల్ నాణ్యతను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మహిళల సౌకర్యార్థం అత్యుత్తమ ప్రమాణాలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పనుల వేగం ఇదే విధంగా కొనసాగించి, రానున్న 4 నుండి 5 నెలల వ్యవధిలో భవనాన్ని పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకమని, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ (జిపి) సెక్రటరీ నరేందర్, ఉపసర్పంచ్ సదానంద్, వార్డ్ మెంబర్ పత్రి రమేష్ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## దేశానికి విద్యార్థులే వెన్నెముక

### -జాతీయ కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులకు మహాలక్ష్మి రమన్ గౌడ్ అభినందనలు..

హైద్రాబాద్ జూలై 28(ప్రజాకలం న్యూస్)
బెంగళూరులో ఆగస్టు 2న జరుగనున్న 14వ షోటోఖాన్ జాతీయ కరాటే పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుండి జివిఆర్ కరాటే అకాడమీకి చెందిన మొత్తం 24 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో 13 మంది బాలికలు, 11 మంది బాలురు ఉన్నారు.ఈ పోటీల్లో బ్లాక్ బెల్ట్, కలర్ బెల్ట్ విభాగాల్లో వివిధ వయసుల కేటగిరీలలో విద్యార్థులు పాల్గొనబోతున్నారు.ఈ విషయాన్ని జివిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి. ఎస్. గోపాల్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులను హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ అభినందించారు. వారు మాట్లాడుతూ, “దేశానికి విద్యార్థులే వెన్నెముక. విద్యార్థులు ఆటపాటల్లో ప్రావీణ్యం సాధిస్తే వారి బాల్యం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పిల్లలకు చదువులతో పాటు ఆటలు కూడా అత్యంత అవసరం.నేటి బాలలే రేపటి పౌరులు.ఈ రోజుల్లో బాలికలకు ఆత్మరక్షణ విద్య అత్యంత అవసరం.ఇటీవల బెంగళూరులో జరిగిన సంఘటనలు తిరిగి దేశంలో జరగకూడదు. అందుకే మహిళలు, బాలికలు ఆత్మరక్షణ విద్యలు తప్పనిసరిగా నేర్చుకోవాలి” అని చెప్పారు.మన తెలంగాణ రాష్ట్రానికి పతకాలు సాధించి రాష్ట్ర గౌరవాన్ని నిలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివేక్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కిషోర్ కృష్ణారెడ్డి, బ్లాక్ బెల్ట్ లు అమృతరెడ్డి,ఘన సంతోషనిరెడ్డి, సుధాకర్,అనగ, అవిజ్ఞ వెంకట్ రెడ్డి, ద్వైత విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హ్యాండ్లూమ్ ఏ. డి శ్రీనివాస్ ని కలిసిన వెంకటరమణ స్కిల్స్ చేనేత ఉత్పత్తిదారుల నూతన అధ్యక్షులు చింతకింది రమేష్

భుదాన్ పోచంపల్లి జులై 28 (ప్రజా కలం )
నూతనంగా ఎన్నుకోబడిన వెంకటరమణ స్కిల్స్ చేనేత ఉత్పత్తి విక్రయ సంఘం నూతన అధ్యక్షులు చింతకింది రమేష్, కార్యవర్గంతో మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా హ్యాండ్లూమ్ ఏ.డి శ్రీనివాస్ అధికారిని ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత పరిశ్రమకు ఎంతో గుర్తింపు పొందింది. ప్రతి చేనేత దారులకు ప్రభుత్వం అన్నివేళలా సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గం ఉపాధ్యక్షు గుద్దేటి నరసింహ,సంఘ కార్యదర్శి సుంకి సుదర్శన్ సంఘ కార్యవర్గ సభ్యులు కొండ వెంకటేష్,సుంకి సాంబయ్య,గణపురం, వెంకటేష్,సామల వెంకటేష్ బింగి రాజు పాల్గొన్నారు.



# కమ్మర్‌పల్లి జూనియర్ కళాశాలకు రూ.1.50 లక్షల విలువైన డ్యూయల్ డెస్క్‌ల పంపిణీ

### ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వేముల ప్రశాంత్ రెడ్డి అండ



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) జూలై 28:
నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లి మండలం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.విద్యార్థుల విజ్ఞప్తి మేరకు తన వియ్యంకుడు ఏనుగు దయానంద రెడ్డి సౌజన్యంతో సుమారు రూ. 1.50 లక్షల విలువైన 40 డ్యూయల్ డెస్క్ బల్లలను కమ్మర్‌పల్లి జూనియర్ కళాశాలకు అందజేశారు. వారం రోజుల్లోనే బల్లలను సమకూర్చిన దాత ఏనుగు దయానంద రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కమ్మర్‌పల్లి జూనియర్ కళాశాలలో నిర్వహించిన డ్యూయల్ డెస్క్‌ల పంపిణీ కార్యక్రమం లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో స్థానిక ప్రజలు,నాయకుల విజ్ఞప్తి మేరకు అప్పటి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును స్వయంగా కలిసి కమ్మర్‌పల్లికి జూనియర్ కళాశాల మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. గత రెండున్నర నుంచి మూడు సంవత్సరాలుగా జూనియర్ కళాశాల పాఠశాల భవనాల్లో కొనసాగుతుండడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల ద్వారా తెలుసుకున్నానని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రస్తుతం ఖాళీగా ఉన్న సాంఘిక సంక్షేమ పాఠశాల భవనంలో కళాశాలను తాత్కాలికంగా తరలించడం, అవసరమైన మరమ్మతులు చేపట్టడం,శాశ్వత కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి తక్షణమే ప్రతిపాదనలు పంపించడం, కళాశాలలో లెక్చరర్ పోస్టులు భర్తీ చేసి సిబ్బంది కొరతను నివారించేందుకు జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కమ్మర్‌పల్లి గ్రామంలో గతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఎన్నికల్లో ప్రజలు ఆశించిన స్థాయిలో మద్దతు ఇవ్వలేదని పేర్కొన్నారు. అయితే ఎన్నికల ఫలితాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని,పదవిలో ఉన్నా లేకున్నా గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్, జిల్లా నాయకులు రాజా గౌడ్,బద్దం చిన్నారెడ్డి,కళాశాల ప్రిన్సిపల్,కమ్మర్‌పల్లి సర్పంచ్ హారిక అశోక్, ఉపసర్పంచ్ అశోక్, ఆర్ ఆర్‌నగర్,చౌట్‌పల్లి, బషీరాబాద్, నర్సాపూర్ గ్రామాల సర్పంచులు,స్పెషల్ ఆఫీసర్,ఎంపీడీవో,వీడీసీ అధ్యక్షుడు సుభాష్,గ్రామ పెద్దలు,అధ్యాపక బృందం,పార్టీ నాయకులు, కార్యకర్తలు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టౌన్ 3 పోలీస్ స్టేషన్‌లో సిపి సాయి చైతన్య ఆకస్మిక తనిఖీ

### - పోలీస్ ఇమేజ్ పెంచేలా విధులు నిర్వర్తించాలి: సీపీ పి.సాయి చైతన్య
### - ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి: పోలీసులకు సీపీ ఆదేశం



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) జులై 28:
నిజామాబాద్ నగరంలోని టౌన్ 3 పోలీస్ స్టేషన్లను మంగళవారం ఉదయం పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య,ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా టౌన్-3 పోలీస్ స్టేషన్‌లో వివిధ రకాల రికార్డులు,కేసు ఫైళ్లు,స్టేషన్ నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్న కమిషనర్,ప్రతి కేసుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక (ప్లాన్ ఆఫ్ యాక్షన్) ఉండాలని,నాణ్యమైన దర్యాప్తుతో కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి,వేగంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. టౌన్-3 పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలు,సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లు,ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడి సైబర్ మోసగాళ్ల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఇలాంటి మోసాలపై ప్రజలను అప్రమత్తం చేసే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి కాలానికి పోలీస్ అధికారులను బాధ్యతగా నియమించి,ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.
కాలనీల్లోని కీలక సమాచారాన్ని ఎప్పటికప్పుడు పైస్థాయి అధికారులకు చేరవేయాలని పేర్కొన్నారు. నిజామాబాద్ నగరానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి కదలికలపై నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని,పరిసర పోలీస్ స్టేషన్లతో సమన్వయం పెంచుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కట్టుదిట్టం చేయడంతో పాటు,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని,యువతలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై చైతన్యం కల్పించాలని తెలిపారు.ప్రతి కేసు దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు.
అనంతరం పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, అధికారులు,సిబ్బంది 24 గంటలు హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని,దూర ప్రాంతాల నుంచి నిత్యం ప్రయాణాలు చేయకుండా చూడాలని అన్నారు.ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని,ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్,టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్,టౌన్-3 ఎస్సై ఏ. హరిబాబు,ఎస్సై-2 నారాయణతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## యల్నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి

### డీఆర్డీఓ నాగిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి భిక్షపతి సూచన

బొమ్మలరామారం, జూలై 28 (ప్రజా కలం):
యల్నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున వరికి బదులుగా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఆర్డీఓ నాగిరెడ్డి సూచించారు. మండల ప్రత్యేక అధికారి భిక్షపతి అధ్యక్షతన మంగళవారం బొమ్మలరామారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.
వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కందులు, పెసర్లు, మినుములు, ఆముదం, నువ్వులు తదితర ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. అలాగే వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, నీటి వనరుల సమర్థ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

**జలసిరి పనులు వేగవంతం చేయాలి**

జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, ఓపెన్‌వెల్ రీచార్జ్ పనులు, మ్యాజిక్ సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్లు, ఫార్మ్‌పాండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గుర్తింపు, కూలీల సమీకరణ, స్వచ్ఛ భారత్ మిషన్ పనులను సమన్వయంతో చేపట్టాలని అధికారులకు సూచించారు.

**మొక్కల సంరక్షణపై దృష్టి**

వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామపంచాయతీల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి గ్రామాల సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఆర్డీఓ నాగిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి భిక్షపతి సూచించారు.
ఈ సమావేశంలో ఎంపీడీవో పి. శ్యామల, తహసీల్దార్ పి. శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి దుర్గేశ్వరి, ఎంపీవో శ్రీమాలిని, ఏపీఓ శ్రీలక్ష్మి, విద్యుత్ శాఖ ఏఈ సందీప్, మండల విద్యాశాఖ అధికారి రోజారాణి, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ వర్తక, మెన్స్ వేర్ సంఘం మండల అధ్యక్షుడుగా దోర్నాల బాలరాజు నియామకం

భుదాన్ పోచంపల్లి జులై 28 (ప్రజా కలం )
పురపాలక కేంద్రంలోని టై అండ్ డై ఫంక్షన్ హాల్ లో మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహ బట్టల వర్తక, మెన్స్ వేర్ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మక్తల కృష్ణ, అధ్యక్షులుగా దోర్నాల బాలరాజు ఉపాధ్యక్షులుగా పి. ప్రవీణ్, రావుల సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎస్ శేఖర్, కోశాధికారి కందగట్ల ధనంజయ, కార్యవర్గ సభ్యులుగా దోర్నాల సంతోష్, భువనగిరి సాగర్, వంగూరి విజయ జిట్టల భాను, రుద్ర బాలసుబ్రమణ్యం, గర్దాసు ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, గంజిగోపాల్ ,విద్యాసాగర్ ,కే సునిత ను ఎన్నుకున్నారు.



## సిద్దిపేట ఎల్లమ్మకు ఆషాడ బోనాలు

సిద్దిపేట:28 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )
సిద్దిపేట శ్రీ మహారేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో ఆషాడ మాసం పురస్కరించుకొని శ్రీ రేణుక మాత గౌడ మహిళల ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించుకున్నారు. డప్పు చెప్పులు,శివసత్తుల నృత్యాలతో అంగరంగ వైభవంగా ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి,ఒడి బియ్యలు పోశారు.ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో బోనాలను ఘనంగా నిర్వహించడంతో పాటు విచ్చేసిన భక్తులందరికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కిశోర్ శర్మ,గౌడ మహిళ ప్రతినిధి రంగు కృష్ణవేణి,సంఘం అధ్యక్షులు పల్లె లాల్ బహిదూర్ గౌడ్, ఉపాధ్యక్షులు మార్క శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పల్లె బాలకిషన్ గౌడ్, కోశాధికారి గాదగోని కిష్టయ్య గౌడ్, డైరెక్టర్లు పల్లె సునీల్ గౌడ్,గాదగోని ప్రకాష్ గౌడ్,గాదగోని సత్యం గౌడ్, పల్లె చంద్రశేఖర్,బాలగొని సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులతో బడి గంట

## - స్థానికుల ఆగ్రహం

నిజామాబాద్, జూలై 28 (ప్రజా కలం ప్రతినిధి):

పాఠశాలల్లో విద్యార్థులతో బడి గంట మోగించడంపై నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని ఇనాయత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వివాదం నెలకొంది. చిన్నారులతో



బడి గంట మోగిస్తున్నారంటూ స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన బడి గంట మోగించడం వంటి బాధ్యతలు ఉపాధ్యాయులు లేదా సిబ్బంది నిర్వహించాల్సి ఉండగా, వాటిని చిన్నారులతో చేయించడం సరైన విధానం కాదని వారు పేర్కొంటున్నారు. విద్యార్థుల ప్రధాన బాధ్యత విద్యాభ్యాసంపై దృష్టి సారించడమే తప్ప, పాఠశాల నిర్వహణ పనుల్లో వారిని భాగస్వామ్యం చేయకూడదని అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు బోధించాల్సిన ఉపాధ్యాయులే తమ విధులను పిల్లలకు అప్పగించడం సమంజసం కాదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# సహకారం లేదు..ఉపాధి ఇవ్వరు-కేటీఆర్

## - రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు కాంగ్రెస్ సహకారం లేదు
## - తగ్గిన ఐటీ ఉద్యోగాలు పాలకుల నిర్లక్ష్యమే కారణం - హైడ్రా కొందరికే..బడాబాబులకు ఒత్తాసు
## - కేంద్ర మంత్రికి కేటీఆర్ విజ్ఞప్తులు, - రాష్ట్రంలో కాంగ్రెస్-బీజేపీలపై తీవ్ర విమర్శలు

హైదరాబాద్, జూలై 28 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే పనులు నత్తనడకన సాగుతున్నాయని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు మండిపడ్డారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కరీంనగర్ రైల్వే లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో భూసేకర ణ ప్రక్రియకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని, 75 కిలోమీటర్ల మేర భూసేకరణ నిలిచి పోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ వైఖరిపై ధ్వజమెత్తారు.

తెలంగాణలో కాజీపేట, కొత్తగూడెం రైల్వే స్టేషన్ లను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని, అలాగే కరీంనగర్ రైల్వే లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాల్లో నిర్మించిన 10 ఐటీ హబ్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవడం లేదని విర్యాధు చేశారు. వరంగల్ లో ఏఐ, ఖమ్మం,కరీంనగర్ లో సైబర్ సెక్యూరిటీ సెంటర్లు కోసం ప్రతిపాదించినా ఇప్పటి వరకు ఆసేవలను వినియోగం చేసుకోవడం లేదన్నారు.జిల్లా కేంద్రాలకు ఐటీ సేవలను



విస్తరించాలని విజ్ఞప్తి చేశారు.

హైడ్రా విష సర్పం, చట్టం కాంగ్రెస్ కు చుట్టం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చర్యల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాను తొమ్మిది తలల విషసర్పంగా అభివర్ణిస్తూ కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆయన గుర్తు చేశారు.గతంలో ఉన్న డీఆర్ఎఫ్ సంస్థ పేరు మార్చి రేవంత్ ప్రభుత్వం బ్లాక్‌మేయిలింగ్‌కు పాల్పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ లో కొత్తగా ఒక్క ఇల్లు కూడా కట్టలేదని, కేవలం విధ్వంసానికి దిగి రియల్ ఎస్టేట్ రంగాన్ని కుప్ప కూల్చారని మండిపడ్డారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకట స్వామి, మాజీ మంత్రి మహేందర్ రెడ్డి, కేవీపీ, గుత్తా సుఖేందర్ రెడ్డిలతో పాటు సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి కి చెందిన నిర్మాణాలు కూడా ఎఫ్టీఎల్ , బఫర్ జోన్లలోనే ఉన్నాయని, అయితే చట్టం మాత్రం కాంగ్రెస్ నాయకులకు ఒకలా, ప్రజలకు మరొకలా చుట్టంలా మారిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున టిడిఆర్ స్కామ్ జరుగుతోందని ఇప్పటికే ఆ స్కాంను బయటపెట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వంలో ఉన్న మంత్రులు నిషేధిత జాబితాలో ఉన్న కోటి ఎకరాల భూమిని

వారి పేరుతో మార్చుకున్నారని స్పష్టం చేశారు.

కేసీఆర్ ఆనవాళ్లు తుడిచేందుకు....

ఇక చేతకాని వారికి మాటలు ఎక్కువ.. చెల్లని నాణేనికి గీతలు ఎక్కువ అని కాంగ్రెస్ నాయకులను ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ. 2.70 లక్షల కోట్ల అప్పులు చేస్తే ఆధాయం పెంచి ఇచ్చినట్లు తెలిపిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుల పేరు తో కాలేజీ బకాయిలు చెల్లించడం లేదన్నారు. కేవలం కేసీఆర్ ఆనవాళ్లు తుడిచేయాలనే కుట్రతోనే అభివృద్ధిని పక్కనపెట్టిందని విమర్శించారు.

కేంద్రంలో ,రాష్ట్రంలో ఉద్యోగాల కోసం పోరు..

కేంద్రంలోని మోదీ పాలన పై కూడా కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రతి ఏటా 2 కోట్ల చొప్పున 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ నెరవేరకపోవడంతో యువతలో నిరాశ, నిస్పృహలు పెరిగిపోయాయని అన్నారు. ఆన్‌లైన్ నిరసనగా మొదలైన యువత ఆగ్రహం నేడు పార్లమెంట్ ముట్టడి వరకు వెళ్లిందని, నిరుద్యోగుల్లో వస్తున్న ఈ తిరుగుబాటును తాను ముందే ఊహించానని చెప్పారు. యువత, పిల్లల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యా, రాజకీయ వ్యవస్థల్లో మార్పులు రావాలని స్పష్టం చేశారు.. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో పాస్ అయినప్పటికీ బీజేపీ దాన్ని అమలు చేయకుండా గందరగోళం చేసిందని ఆరోపించారు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల డీలిమిటేషన్ చేపట్టి, పెరిగిన జనాభాకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ఎమ్మెల్యే స్థానాలను 6 వేలకు పెంచి, అధికార వికేంద్రీకరణ జరపాలని వెల్లడించారు..



# మహంకాళి జాతరకు ఆహ్వానం

సికింద్రాబాద్ జూలై 28 (ప్రజా కలం ప్రతినిధి)

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయాన్ని సందర్శించి, బోనాలు వేడుకల్లో భాగస్వామ్యం కావాలని చారిత్రాత్మక ఉజ్జయిని మహంకాళి దేవాలయం అధికారులు సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ను కోరారు. ఈ మేరకు ఆలయం కార్యనిర్వహణాధికారి మనోహర్ రెడ్డి, ప్రధానార్చకుల నేతృత్వంలోని బృందం మోండా మార్కెట్ టకార బస్తీ లోని పద్మారావు గౌడ్ నివాసాన్ని మంగళవారం సందర్శించి ఆహ్వాన పత్రికను అందించింది. ఆలయం సాంప్రదాయ బద్దంగా పద్మారావు దంపతులను సత్కరించి ఆశీర్వాదం అందించారు. బోనాలు వేడుకలను ఘనంగా నిర్వహించాలని, అన్ని సంప్రదాయాలు పాటించి భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు జరపాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా సూచించారు. యువ నేత రామేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాతృ, శిశు మరణాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

సంగారెడ్డి, ప్రతినిధి జూలై 28 ( ప్రజా కలం ): జిల్లాలో ప్రసవాల సందర్భంగా మాతృ, శిశు మరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటుచేసుకోకుండా అన్ని స్థాయిల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్యాధికారులను ఆదేశించారు. గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశ నుంచే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను పూర్తిగా నివారించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాతృ, శిశు మరణాల ఆడిట్‌తో పాటు జిల్లాలో గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం--1994 అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇటీవల నమోదైన ప్రతి మాతృ, శిశు మరణ ఘటనను కేసు వారీగా పరిశీలించారు. ఏ ఆసుపత్రిలో ఘటన చోటుచేసుకుంది, మరణానికి దారితీసిన కారణాలు ఏమిటి, వైద్య సేవలలో ఎక్కడైనా నిర్లక్ష్యం లేదా లోపాలు జరిగాయా అనే అంశాలపై సంబంధిత వైద్య సిబ్బంది నీ ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. వైద్య రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన నివారణ చర్యలను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. గర్భిణులను గర్భధారణ ప్రారంభం నుంచే నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని వైద్య పరీక్షలను సకాలంలో నిర్వహించాలని, హై రిస్క్ ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి తక్షణమే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు. హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గైనకాలజిస్టులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గర్భిణికి, ప్రతి నవజాత శిశువుకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవానంతరం తల్లి--శిశువుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా సమర్థవంతమైన కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో చట్టం--1994ను కట్టుదిట్టంగా అమలు చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు నిరంతర తనిఖీలు, పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఎంసీహెచ్) డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ శశాంక్, సంబంధిత వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరిని గుండెల్లో పెట్టుకుంటా

## - మైనంపల్లి హనుమంతరావు



మల్కాజిగిరి,జులై 28 (ప్రజా కలం ప్రతినిధి)

ఎస్ ఆర్ ఐ నమోదు కార్యక్రమంలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకునికి గుర్తింపు ఉంటుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు.మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మల్కాజిగిరిలో బిఎల్ఎ లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పార్టీ నాయకులు,అబ్జర్వర్ సమీర్ కౌశల్ లు హాజరయ్యారు.ఇప్పటికీ 100 శాతం ఎస్ ఆర్ ఐ నమోదు పూర్తి చేసిన వారికి మైనంపల్లి చేతుల మీదుగా బహుమతులను అందజేసి శాలువతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను నాయకుడిని కాపాడుకుంటానని కష్టపడి పనిచేసిన వారికి మంచి ప్రోత్సాహన్ని అందిస్తామని వెనుకబడిన ప్రతి బి ఎల్ ఏ ఇప్పటికైనా ముందుండి పని చేయాలని సూచించారు. అబ్జర్వర్ మాట్లాడుతూ ఏ నియోజకవర్గంలో లేనివిధంగా మల్కాజిగిరి నియోజకవర్గం లో మైనంపల్లి హనుమంతరావు పతి బిఎల్ ఎ కు ప్రోత్సాహన్ని అందిస్తూ అందర్నీ సమానంగా చూడాలని వారు కష్టపడి పని చేస్తారని చెబుతున్నారని ఒకరిని ఎక్కువ ఒకరిని తక్కువ కాకుండా ఇకముందు కష్టపడే వారిని ప్రత్యేక గుర్తింపు ఇస్తామని వారు చెప్పడం మైనంపల్లి మనసు గొప్పదని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు ప్రేమ్ కుమార్,జితేంద్ర నాథ్, మల్కాజిగిరి ఇంచార్జీ లక్ష్మీ కాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్ర శేఖర్,బి బ్లాక్ అద్యక్షుడు వెంకటేష్ యాదవ్,బి కే శ్రీనివాస్,సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్,డివిజన్ అధ్యక్షులు,జీడి సంపత్ గౌడ్ వైనాల ప్రవీణ్ కుమార్,వినోద్ యాదవ్, సత్యమూర్తి యూసుఫ్ భాయ్ పిట్టల నాగరాజు, శ్రీకాంత్,లక్ష్మి,రాందాస్ సంతోష్ ముదిరాజ్, రామచందర్,పార్థ సారథి,వెంకన్న, శ్రీరామ్ యాదవ్,సురేష్ సింగ్, అశోక్ రెడ్డి,నవీన్,ఆశా, సుమలత యాదవ్,పుష్పలత, ఇందిర ప్రియదర్శిని, లోశారద,రోజా రమణి, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# పార్టీని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యం

## మహేశ్వరం నియోజకవర్గం

## టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జిగా కోల శ్రీనివాస్ నియామకం

మహేశ్వరం, జూలై 28,(ప్రజా కలం)

తెలంగాణ రక్షణ సేన టి ఆర్ ఎస్ పార్టీ వ్యవస్థాపక అధినేత్రి కల్వకుంట్ల కవితక్క మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన బడంగ్‌పేట్ నివాసి కోల శ్రీనివాస్ కి మహేశ్వరం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కోల శ్రీనివాస్ గారి ప్రొఫైల్ బీసీ సామాజికవేత్త తెలంగాణ ఉద్యమ నేత 30 సంవత్సరాల రాజకీయ అనుభవం - గతంలో ఎమ్మెల్యేగా పోటి చేసిన నాయకుడు

-తెలంగాణ ఎంబీసీ సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ప్రజల్లో ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలు తీర్చే బహుజన బిడ్డ పార్టీ నిర్మాణానికి పూర్తి సమయం కేటాయించి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇన్ని ఉద్యమాలు చేసిన, జెండా పట్టే కార్యకర్తలన్నీ చూసిన టి ఆర్ ఎస్ పార్టీలోనే ఎమ్మెల్యే స్థాయి పదవి ఒక సాధారణ కార్యకర్తకు రావడం కవితక్క గారికే సాధ్యం జాతీయ పార్టీలలో ఇలాంటి పదవులు, నామినేటెడ్ పోస్టులు కార్యకర్తలకు రావు. ప్రాంతీయ పార్టీగా ఏర్పడ్డ టి ఆర్ ఎస్ పార్టీ రాబోయే రోజుల్లో కచ్చితంగా అధికారంలోకి వస్తుంది కల్వకుంట్ల కవితక్క కచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారు. అని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అందరి పార్టీగాలి ఈరోజు ఆదరణ పొందుతున్న టి ఆర్ ఎస్ పార్టీ ఎక్కడ అన్యాయం ఉన్నా అక్కడ న్యాయం జరిగే వరకు పోరాడే పార్టీ అని కోల శ్రీనివాస్ స్పష్టం చేశారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com